## అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్,శాలిబండ గోమతి ఎలక్ట్రానిక్స్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై మొగల్‌పురా పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మణికంఠను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కారు డ్రైవర్ సంచలన విషయాలు బయటపెట్టారు. రాత్రి 10:30 గంటలకు ఏదో పెద్ద బ్లాస్ట్ అయినట్టుగా ఒక్కసారిగా శబ్దం వినిపించిందని.. శబ్దం రావడంతో తన కారు పల్టీ కొట్టిందని తెలిపారు. కారుకు సంబంధించిన గ్లాస్ మొత్తం కూడా ధ్వంసం అయిపోయిందన్నారు.కార్‌లో తాను ఒక్కడినే ఉన్నానని.. కార్ ముందు అద్దాలను పగలగొట్టి బయటపడినట్లు తెలిపారు. కారు నుంచి బయటకు వచ్చిన వెంటనే పూర్తిగా కాలిపోయిందని చెప్పారు. కారులో సీఎన్జీ సిలిండర్ ఏమి పేలలేదని స్పష్టం చేశారు. ఎవరెస్ట్ ఫ్లీట్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్ అనే కంపెనీ పేరుతో ఉబర్ డ్రైవర్‌గా ఉబర్ నడుపుతున్నట్లు వెల్లడించారు. చార్మినార్ దగ్గర ప్యాసింజర్స్‌ను డ్రాప్ చేశానని... మరో పికప్ శాలిబండ సైడ్ పడిందని అందుకే అక్కడికి బయలుదేరినట్లు తెలిపారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :235 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 27-11-2025 | పేజీలు:4 వెల: 2.00


## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సర్కార్ మోసం.. రాహుల్ గాంధీని ప్రశ్నించిన కేటీఆర్



హైదరాబాద్, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా చూపించడంపై ఆయన మండిపడ్డారు. కులగణన పేరుతో భారీగా ప్రజాధనాన్ని ఖర్చు చేసి, చివరకు బీసీ వర్గాలకు అన్యాయం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరుతో రూ.160 కోట్లను ఖర్చు చేసిందని కేటీఆర్ తెలిపారు. చివరకు పంచాయతీ ఎన్నికలు వచ్చేసరికి బీసీలకు కేవలం 17 శాతం రిజర్వేషన్లనే కేటాయించిందని పేర్కొన్నారు. గతంలో బీసీలకు ఉన్న 24 శాతం కోటాను కూడా ఇవ్వకుండా కోత పెట్టి బడుగులకు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. కులగణన పేరిట ప్రజా ధనాన్ని వృథా చేసి, చివరకు బీసీ రిజర్వేషన్లను తగ్గించడానికి కాంగ్రెస్ నాయకత్వం ఏ జ్ఞానంతో పనిచేసిందని ఆయన ప్రశ్నించారు. ఈ మోసంపై స్పందిస్తారా అని రాహుల్‌గాంధీని నిలదీశారు.

### బీసీలను మోసం చేసిందిట్లా..!

సుదీర్ఘకాలంపాటు దేశాన్ని ఏలిన అనుభవం. రాజ్యాంగ మార్గదర్శకాలు.. సుప్రీంకోర్టు ఆంక్షలు.. అమల్లో ఉన్న చట్టాలు అన్నీ తెలుసు. అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలను గుప్పించింది. అందులో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఒకటి. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే కులగణన నిర్వహించి, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రస్తుతం ఉన్న 23% రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని వాగ్దానం చేసింది. హామీ అమలు కోసమైనా చిత్తశుద్ధితో కృషి చేసిందా? అంటే అదీ లేదు. కమిషన్ల నియామకం.. ఇంటింటి సర్వే.. నివేదికలు.. అసెంబ్లీలో బిల్లుల ఆమోదం.. ఆర్డినెన్స్, జీవోలు జారీ వరకూ ప్రభుత్వం వ్యవహరించిన తీరే అద్దం పడుతున్నది. ఒకసారి కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, మరోసారి రాజ్యాంగబద్ధంగా కల్పిస్తామని, ఇంకోసారి ఆర్డినెన్స్ ద్వారా అమలుచేస్తామని, పార్టీపరమైన రిజర్వేషన్లు కల్పిస్తామని, చివరకు పాతకోటా అంటూ పూటకో మాట చెప్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన విధానరహిత, లోపభూయిష్ట మార్గదర్శకాల ఫలితంగా అనేక న్యాయపరమైన సవాళ్లు ఎదురవడమే కాదు, ఉన్న రిజర్వేషన్లే దక్కని ప్రమాదం వచ్చిపడిందని బీసీవర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### కులగణన పేరిట గారడీ

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సర్వే చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఏడాదిపాటు ఆ ఊసే ఎత్తలేదు. కులగణనకు రూ.150 కోట్లు విడుదల చేస్తూ 2024 జనవరి 28న ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, కుల ఇంటింటి సర్వే నిర్వహించాలని 2024 ఫిబ్రవరి 17న అసెంబ్లీ తీర్మానం చేసింది. పార్లమెంట్ ఎన్నికల ముందు బీసీ సంక్షేమ శాఖ ఇంటింటి సర్వేను నిర్వహిస్తుందని 2024 మార్చి 15న జీవో 26 జారీచేసింది. ఇంటింటి సర్వేను ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తుందని పేర్కొంటూ 2024 అక్టోబర్ 10న జీవో-18 జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2024 నవంబర్ 6న ఇండ్ల గుర్తింపుతో ప్రారంభమైన ఇంటింటి సర్వే ప్రక్రియ అదే నెల 26వ తేదీ వరకు కొనసాగింది. ఆ తరువాత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో 2025 జనవరిలో క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటుచేసింది., ఫిబ్రవరి 2న క్యాబినెట్ సబ్‌కమిటీకి సర్వే నివేదికను ప్లానింగ్ విభాగం సమర్పించింది. 2025 ఫిబ్రవరి 4న అసెంబ్లీలో సర్వే స్థూల గణాంకాలను వెల్లడించడంతోపాటు ఆమోదం తెలిపింది. బీసీ కుల గణాంకాలు, తెలంగాణ జనాభా లెక్కలు తదితర అంశాలపై తీవ్ర అభ్యంతరాలు రావడంతో 2025 ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు రీ సర్వే నిర్వహించిన ప్రభుత్వం.. స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ గణాంకాలను వెల్లడించింది తప్ప, కులాలు, ఉపకులాల వారీగా లెక్కలేవీ వెల్లడించలేదు. నివేదికను బహిర్గత పరచలేదు. అభ్యంతరాల స్వీకరణ చేపట్టనూ లేదు. ఇదీ రాజ్యాంగ విరుద్ధం.

### నివేదికలన్నీ గోప్యం

సర్వే నివేదికలనే కాదు బూసాని వెంకటేశ్వర్లు నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ సమర్పించిన నివేదికలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ బయటపెట్టలేదు. ఇదిలా ఉంటే ఇంటింటి సర్వే గణాంకాలను విశ్లేషించడానికి తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో 11 మంది సభ్యుల స్వతంత్ర నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేసింది. తెలంగాణలో సామాజిక న్యాయం, కుల నిర్మాణాలపై పరిశోధనలు చేసిన నిపుణులు ఎందరోఉన్నా, వారందరినీ పకనపెట్టి ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెట్టిని వర్కింగ్ గ్రూపు సభ్యుడిగా నియమించింది. ఈ వరింగ్ గ్రూప్ సర్వే డాటాను విశ్లేషించి నివేదికను సమర్పించింది. సర్కారు ఆ నివేదికనూ బహిర్గత పరచలేదు. పూర్తిగా గోప్యంగానే దాచిపెట్టింది.

### అసెంబ్లీలో బిల్లులు.. ఢిల్లీలో ధర్నా డ్రామాలు

తుదకు డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా విద్య, ఉద్యోగ, ఉపాధిరంగాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ 2025 మార్చి 7న క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అందుకు అనుగుణంగా మార్చి 17న బిల్లు నంబర్ 3 ద్వారా విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను, మార్చి 17న బిల్లు నంబర్ 4 ద్వారా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచారు. ఆ రెండు బిల్లులను గవర్నర్‌కు ప్రభుత్వం పంపింది. పక్షం రోజులు గడవక ముందే ఆ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ 2025 ఏప్రిల్ 2న ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా నిర్వహించింది. అయితే, ఈ ధర్నాలో పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే పాల్గొనలేదు.

## నేనే సీనియర్ అన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి...ఉన్నదే చెప్పారా ?

హైదరాబాద్,తెలంగాణా కాంగ్రెస్ లో రాజకీయం అంతా బయటకు సాఫీగానే సాగుతోంది. కర్ణాటకలో మాత్రం సీఎం కుర్చీ కోసం పోటీ స్టార్ట్ అయింది. అయితే అక్కడ ఒప్పందం ఉందని అంటున్నారు. మరి తెలంగాణాలో అలాంటి లోపాయికారీ ఒప్పందాలు ఏమైనా ఉన్నాయా అన్న చర్చ కూడా సాగుతోంది. ఎందుకంటే కర్ణాటకతో పోలిస్తే తెలంగాణాలోనూ సీనియర్ నేతలు ఎక్కువ మందే ఉన్నారు అందరూ దిగ్గజ నేతలే. ఇక సీఎం రేవంత్ రెడ్డి రాజకీయంగా రెండు దశాబ్దాల అనుభవం కలిగిన నేత అయినప్పటికీ కాంగ్రెస్ రాజకీయాల్లో ఆయన వీరితో పోలిస్తే కొత్త వారే అని అంటారు. అయినా ఆయనను ముఖ్యమంత్రి పదవి లభించింది అంటే ఆయనకు ఉన్న మాటకారితనం, ప్రజాకర్షణ శక్తి. కేసీఆర్ ని ఢీ అంటే ఢీ కొట్టిన డేరింగ్ పర్సనాలిటీ.

### కీలక వ్యాఖ్యలేనా :

ఇక కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం కుస్తీ మొదలైన వేళ తెలంగాణా కాంగ్రెస్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యల మర్మమేంటి అన్న చర్చ సాగుతోంది. ఆయన మీడియాతో పిచ్చాపాటీగా మాట్లాడుతూనే తాను సీనియర్ అని చెప్పుకున్నారు. నిజం చెప్పాలి అంటే ఈ వ్యాఖ్యలను అంత సీరియస్ గా తీసుకోవాల్సింది లేదని అంటున్నారు. పైగా ఆయన చెప్పినది కరెక్టే కదా అని అంటున్నారు.

### ఇంతకీ ఏమన్నారు అంటే :

ఇక ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏమన్నారు అంటే తెలంగాణ శాసనసభలో అందరిలోకీ తాను అత్యంత సీనియర్ ఎమ్మెల్యేను అని. ఇక తన కంటే సీనియర్ గా మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ ఉన్నారని కానీ ఆయన అసెంబ్లీకే సభకు రావడం లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. ఇక అలా చూస్తే కనుక ప్రస్తుతం అసెంబ్లీకి వచ్చే వారిలో మాత్రం తాను సీనియర్ నాయకుడినని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫుల్ క్లారిటీగా చెప్పేశారు అంతే కాదు ఆయన మరో మాట కూడా అన్నారు. ఏడుసార్లు ఒకే పార్టీ బీఫామ్‌పై గెలిచిన వ్యక్తిని తానే అని. అంటే తాను పార్టీలు మారలేదని కాంగ్రెస్ నే నమ్ముకుని గెలిచి వస్తున్న వాడిని అని గట్టిగా చెప్పారు అన్న మాట.



### పీసీసీ చీఫ్ గా :

ఇక వైఎస్సార్ క్యాబినెట్ లోనే మంత్రిగా కీలక శాఖలు చూసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి సీనియర్ మోస్ట్ లీడర్ అని అంతా అంటారు. అంతే కాదు ఆయన తెలంగాణా కాంగ్రెస్ కి పీసీసీ చీఫ్ గా సుదీర్ఘ కాలం వ్యవహరించారు. బ్యాడ్ లక్ ఏమిటి అంటే ఆయన టైంలో రెండు సార్లు కాంగ్రెస్ బీఆర్ఎస్ తో పోటీ పడినా అధికారంలోకి రాలేకపోయింది. కనీసం 2018లో వచ్చినా కూడా మరో చాయిస్ లేకుండా ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎం అయిపోయేవారు. కానీ 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది కానీ ఉత్తం మాజీ పీసీసీ చీఫ్ గా అప్పటికి ఉన్నారు

### అదన్న మాట మ్యాటర్.:

ఇక సీఎం రేసులో అప్పట్లో ఆయన పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. కానీ చివరికి మంత్రిగా సర్దుకున్నారు. మరి ఇపుడు ఆయన సీనియర్ నేతను అని ఒకే పార్టీ గుర్తు మీద వరసగా ఏడు సార్లు గెలిచాను అని ప్రత్యేకంగా చెప్పడమో అర్ధమేంటని అంతా ఆలోచిస్తున్నారు. రాజకీయాలో ఆశలు లేవని ఎవరు చెప్పినా తప్పే అవుతుంది. అలాగే ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక పదవుల విషయంలో ఆలోచించినా తప్పు ఏ మాత్రం కాదు, పైగా ఆయనకు అన్ని అర్హతలు ఉన్నాయనే అంటారు. అయితే కాలమే ఎవరికి అయినా కలిసి రావాలి. సో అదన్న మాట మ్యాటర్.

## హైదరాబాద్‌లో హైడ్రా సంచలనం : నల్లకుంట చెరువు పునరుద్ధరణపై ప్రశంసల జల్లు!




హైదరాబాద్,ప్రభుత్వ భూములు, చెరువుల అక్రమ ఆక్రమణకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన హైడ్రా (హైదరాబాద్ డెవలప్‌మెంట్ అండ్ రీఫార్మ్ అథారిటీ – ఊహాత్మక పేరు) విభాగం ఇప్పుడు నగరంలో టాప్ గేర్‌లో దూసుకెళ్తోంది. ప్రభుత్వ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకునే క్రమంలో హైడ్రా చేపట్టిన పటిష్ట చర్యలకు సంబంధించి ఒక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది.

### కూకట్‌పల్లి నల్లకుంట చెరువుకు 'రెండో జన్మ'

కూకట్‌పల్లి పరిధిలోని నల్లకుంట చెరువు పునరుద్ధరణే ఈ వైరల్ వీడియోకి ప్రధాన అంశం. గత దశాబ్దంలో అక్రమ నిర్మాణాల కారణంగా 2016 నుంచే చెరువు దాని రూపాన్ని పూర్తిగా కోల్పోయింది. స్థానికుల ఫిర్యాదులు పట్టించుకోని పరిస్థితుల్లో, కొత్త ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది.

### బుల్డోజర్లతో దురాక్రమణలకు చెక్ : హైడ్రా వేగం

వైరల్ అవుతున్న దృశ్యాలలో హైడ్రా విభాగం పనిచేసిన వేగం, దూకుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతి తక్కువ సమయంలోనే భారీ యంత్రాలను ఉపయోగించి చెరువు ప్రాంతంలో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను నేలమట్టం చేశారు. అక్రమ కట్టడాలను తొలగించడం... చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయడం... సహజ నీటి ప్రవాహ మార్గాలను తిరిగి తెరిచి, చెరువుకు నీటిని చేరేలా చేశారు. ఈ పనుల ఫలితంగా కొద్ది రోజుల్లోనే నల్లకుంట చెరువు మళ్లీ జలకళతో నిండిపోయి, పూర్వ వైభవాన్ని సంతరించుకుంది.

### ప్రజల ప్రశంసలు, పెరిగిన నమ్మకం

నల్లకుంట చెరువు పునరుద్ధరణ ప్రాజెక్టును హైడ్రా చేపట్టిన పనుల్లో అత్యంత ప్రముఖమైనదిగా గుర్తించబడుతోంది. ప్రభుత్వ స్థలాలను, ముఖ్యంగా జల వనరులను కాపాడటంలో ప్రభుత్వం చూపుతున్న పట్టుదల ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది. సోషల్ మీడియాలో నెటిజన్లు హైడ్రా పనితీరును, ప్రభుత్వ నిబద్ధతను ప్రశంసిస్తూ పోస్టులు పెడుతున్నారు. అధికారిక సమాచారం ప్రకారం.. నల్లకుంట చెరువు ప్రాంతం మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత, డిసెంబర్ నెలలో దానిని తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

### హైడ్రా నిఘా

అక్రమ కబ్జాల బారి నుంచి ప్రభుత్వ భూములను, చెరువులను రక్షించేందుకు ప్రభుత్వం మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇది రాష్ట్రంలో సుపరిపాలనకు, పర్యావరణ పరిరక్షణకు కొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

## రాజ్యాంగ విధులను నిర్వర్తించండి: ప్రధాని మోదీ


న్యూఢిల్లీ: దేశ పౌరులు తమ రాజ్యాంగ విధులను నిర్వర్తించాలని ప్రధాని మోదీ కోరారు. బలమైన ప్రజాస్వామ్యానికి ఇవే పునాది అని ఆయన అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన దేశ పౌరులకు లేఖ రాశారు. ఓటు హక్కును వినియోగించడం వల్ల ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యతను నిర్వర్తించాలన్నారు. 18 ఏళ్లు నిండి తొలిసారి ఓటరుగా మారిన వ్యక్తులను రాజ్యాంగ దినోత్సవం రోజున గౌరవించాలన్నారు. కర్తవ్యాలను నిర్వర్తించడం వల్లే హక్కులు వస్తాయని మహాత్మా గాంధీ విశ్వాసాన్ని ప్రధాని మోదీ గుర్తు చేశారు.సామాజిక, ఆర్థిక ప్రగతికి విధుల నిర్వహణ కీలకమన్నారు. నేటి తరం తీసుకునే విధానాలు, నిర్ణయాలు రాబోయే తరం జీవితాలను మార్చేస్తుందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా వెళ్తున్న దేశాన్ని మదిలో పెట్టుకుని పౌరులు తమ కర్తవ్యాలను అమలు చేయాలన్నారు. మానవ హుందాతనానికి, సమానత్వానికి, విముక్తికి మన రాజ్యాంగం ప్రాధాన్యత ఇస్తుందని, మనకు హక్కులను కల్పిస్తుందని, దీంతో పాటు పౌరులమన్న బాధ్యతలను కూడా కల్పిస్తుందని, దీన్ని మనం ఎప్పుడూ నిర్వర్తించాలని, ఆ విధులే మన బలమైన ప్రజాస్వామ్యానికి



పునాది రాళ్లు అవుతాయని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు.రాజ్యాంగ నిర్మాతలకు కూడా ఆయన ఈ సందర్భంగా నివాళి అర్పించారు. రాజ్యాంగ నిర్మాతల విజన్, ముందుచూపు ప్రేరణతోనే వికసిత్ భారత్ సాధించాలన్నారు.

## భద్రాద్రిలో భక్తి ముసుగులో బట్టల వ్యాపారం గుట్టురట్టు

భద్రాద్రి కొత్తగూడెం: భక్తి ముసుగులో బట్టల వ్యాపారం గుట్టురట్టు జరిగిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో చోటుచేసుకుంది. భక్తులు స్వామివారికి సమర్పించే వస్త్రాల అమ్మకాల్లో గోలుమాల్ జరిగింది. వస్త్ర దుకాణాల నుంచి కొనుగోలు చేసిన వస్త్రాలను భక్తులకు అమ్మవారి చీరలు అని చెప్పి కొందరు అమ్ముతున్నారు. భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా దేవస్థానం కార్యనిర్వహణాధికారి దామోదర్ రావు పట్టుకున్నారు. సాధారణంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన వస్త్రాలను తిరిగి కొనుగోలు చేసే విధానం ఒకటి ఉంటుంది. ఈ వ్యవస్థను భ్రష్టు పట్టించడమే కాకుండా మార్కెట్‌లోని దుకాణాల నుంచి కొనుగోలు చేసి బట్టలను భక్తులకు అమ్మేందుకు కొందరు సిద్ధం చేయడంతో వారిని అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా నిల్వ చేసిన వస్త్రాలను తనిఖీ చేయడంతో పాటు స్వాధీనం చేసుకున్నామని భక్తుల నమ్మకాన్ని వ్యాపారంగా మలచడం దారుణమని



ఇఒ మండిపడ్డారు. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనపై భక్తులు మండిపడుతున్నారు.

## తెలంగాణ పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఖరారు...



హైదరాబాద్,తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. విద్యార్థుల పై భారం తగ్గించేలా కొత్త మార్పులతో పరీక్షల నిర్వహణకు యంత్రాంగం సిద్ధం అవుతోంది. గతానికి భిన్నంగా ఒక్కో పరీక్ష మధ్య ఒకటిరెండు రోజుల వ్యవధి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.దీని పైన తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సీబీఎస్ఈ పరీక్షల విధానం తరహాలో నిర్వహణ పైన ప్రతిపాదన లు రావటంతో..ఆ దిశగా కసరత్తు జరుగుతోంది.తెలంగాణలో పదో తరగతి వార్షిక పరీక్షలు వచ్చే మార్చి 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు షెడ్యూల్ ఖరారు చేసారు. ప్రభుత్వం ఆమోదం తరువాత అధికారికంగా ప్రకటన చేయనున్నారు. కాగా, ఈసారి గతానికి భిన్నంగా ఒక్కో పరీక్ష మధ్య ఒకటిరెండు రోజుల వ్యవధి ఇవ్వాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా పాఠశాల విద్యాశాఖ అధికారులు రెండు మూడు రకాల షెడ్యూళ్లను రూపొందించారు. ఈ నేపథ్యంలోనే పదో తరగతి పరీక్షల తేదీల ప్రకటనలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. ప్రభుత్వం ఈ రెండు షెడ్యూళ్ల లో ఒక దానికి ఆమోదం తరువాత అధికారికంగా తేదీలను ప్రకటించనున్నారు.సీబీఎస్ఈ పరీక్షల విధానంలో ఎగ్జామ్స్ నిర్వహణలో వ్యవధి ఉంటుంది. అదే విధానాన్ని తెలంగాణలో పదో తరగతికి అమలు చేస్తే విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పరీక్షల మధ్యలో వ్యవధి ఉండటం వల్ల విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదువుకుంటా రని నిపుణులు సూచిస్తున్నారు. సీబీఎస్ఈ పది, 12 తరగతులకు ఒకేసారి పరీక్షలను నిర్వహిస్తోంది. సీబీఎస్ఈ ఎగ్జామ్స్ పూర్తి షెడ్యూల్‌ను సెప్టెంబరు 24వ తేదీన విడుదల చేసింది.పదో తరగతి పరీక్షల తేదీలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అయితే, పరీక్షల నిర్వహణలో ఎలాంటి మార్పులు లేకుండా వరుసగా నిర్వహించటం ద్వారా విద్యార్థుల పైన ఒత్తిడి ఉండదనే మరో వాదన ఉంది. దీంతో.. పరీక్షల మధ్య వ్యవధి ఇస్తూ ఒక షెడ్యూల్... గతం లో లాగానే కంటిన్యూగా పరీక్షల నిర్వహణకు మరో షెడ్యూల్ సిద్ధం చేసారు. పరీక్షల ప్రారంభం మాత్రం మార్చి 18గా ఖరారు చేసారు. ప్రభుత్వం తుది నిర్ణయంతో షెడ్యూల్ విడుదల కానుంది.

## తుపాన్‌గా మారిన తీవ్ర వాయుగుండం.. సెన్యార్‌గా నామకరణం



మలేషియా పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం తుఫాన్‌గా మారింది. బుధవారం ఉదయం తుపాన్‌గా మారిన ఈ తీవ్ర వాయుగుండం మలక్కా జలసంధి ప్రాంతంలో కదులుతున్నదని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపాన్‌కు సెన్యార్‌గా నామకరణం చేసినట్లు పేర్కొంది. ఈ తుఫానుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) 'సెన్యార్' అని పేరు పెట్టినట్టు వెల్లడించింది.కాగా ఈ తుపాన్ 24 గంటల తర్వాత క్రమంగా బలహీన పడే అవకాశం ఉందని అంచనా వేసింది. పశ్చిమ దిశగా కదులుతున్న తుపాన్ ఇవాళ మధ్యాహ్నానికి ఇండోనేషియా తీరం వైపు వెళ్లనుంది. ఈ తుపాన్ భారత్‌పై ప్రభావం చూపే అవకాశం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో దక్షిణ శ్రీలంక, హిందూ మహాసముద్రం మీదుగా అల్పపీడనం కొనసాగుతుందని పేర్కొంది.

## సంపాదకీయం

**గురువారం 27-11-2025**

# మాయమైపోతున్న మనిషి

మనిషి నడక చిత్రంగా ఉంటుంది. అతను ముందుకు వెడుతున్నా ననుకుంటాడు, కానీ అతనికి తెలియకుండానే అడుగులు వెనక్కి పడుతూ ఉంటాయి. అది తెలుసుకునే లోపల జరగాల్సిన నష్టం జరిగిపోతూ ఉంటుంది. ఉదాహరణకే చూడండి: మనిషి పుడుతూనే మనిషి కాలేదు. ఇతర జంతుజాలంలానే తనూ పుట్టాడుబీ తనలాంటివాళ్ళతో గుంపు కట్టాకే మనిషయ్యాడు, పదిమందిలో ఒకడిగా ఉంటేనే తనకూ, పదిమందికీ కూడా భద్రత అని తెలుసుకున్నాడు. గణంగా మారాడు, సమాజంగా ఎదిగాడు, రాజ్యంగా అవతరించాడు, సామ్రాజ్యంగా విస్తరించాడు. మళ్ళీ తనే దేశంగా మారే క్రమంలో సరిహద్దులు గీసుకుని సాటి మనుషుల్ని దూరం పెట్టే తిరోగమనమూ చిత్తగించాడు. మనిషి హోమోసేపియన్స్ పేరిట ఆధునిక మానవుడిగా అవతరించే నాటికే ఈ భూగోళం సువిశాలం. భూమ్మీద మానవ జనాభా లక్షల సంఖ్యకు చేరడానికి కూడా చాలా కాలం పట్టిందని శాస్త్రవేత్తలు అంటారు. మనుషుల గుంపుల మధ్య అనంతమైన దూరం ఉండేది. ఆ దూరాన్ని తరించడానికి కాలాన్ని జయించవలసివచ్చేది. ఆయుర్దాయం ముప్పై, నలభయ్యేళ్ళను మించేది కాదు కనుక, అందుకొక జీవితకాలం కూడా చాలేది కాదు. గణాల మధ్య అల్లుకున్న బంధుత్వాలు, ప్రేమలు, స్నేహాలు దూరాల్ని చెరిపి మనుషులను మానసికంగా దగ్గర చేసేవి. పసిఫిక్ మహాసముద్రంలోని ట్రోబ్రియాండ్ దీవిజనం నౌకల మీద వెళ్ళి వెయ్యి మైళ్ళదూరంలో ఉన్న గణబంధువుల్ని కలిసి వాళ్ళకు కానుకలు ఇచ్చి రావడాన్ని ఒక పవిత్రమైన యజ్ఞంలా ఎలా జరిపేవారో ప్రముఖ మానవ శాస్త్రవేత్త బోనిస్లా మలినోవ్‌స్కీ రాస్తాడు. విచిత్రంగా, వాటికి 'కులయాత్ర'లని పేరు. తరగని దూరాలు ఉన్నప్పుడు మానసికంగా మమతలు పెంచుకుంటూ దగ్గరగా ఉన్న మనుషులు, దూరాలు మాయమై భౌతికంగా దగ్గరగా ఉన్నా కూడా దూరమయ్యే స్థితికి చేరుకున్నారు. మహానగరాలు, పట్టణాలలో బహుళ అంతస్తుల గృహ సము దాయాల్లో ఏళ్ల తరబడిగా కలసి ఉంటున్నా ఒకరికొకరు తెలియని పరిస్థితికి వచ్చారు. తమ ఉమ్మడి భద్రత కోసం, తమను కలిపి ఉంచడం కోసం తమే సృష్టించుకున్న వ్యవస్థలే తమను విడదీసేవయ్యాయి. బ్రిటిష్ ఏలుబడిలో న్యాయస్థానాల ఏర్పాటు జరిగిన తర్వాత చిన్నాచితకా వివాదాలపై కూడా కోర్టుకు వెళ్ళడం ఎలా వేలంవెర్రిగా మారిందో, చివరికది కుటుంబ సభ్యుల్లోకి కూడా పాకి ఉమ్మడి కుటుంబ వ్యవస్థను ఎలా ఛిద్రం చేసిందో ఆ కాలపు ఉదంతాలు కళ్ళకు కట్టిస్తాయి. ఓ కుటుంబంలో ఆస్తి తగాదా పుట్టి ఏకంగా తల్లీ, కొడుకులే కోర్టు కెక్కారట. వాయిదాకు పొరుగూరు వెళ్లవలసి వచ్చి నప్పుడు ఇద్దరూ కలిసే వెళ్ళేవారట. ఒకే సత్రంలో దిగేవారట. కొడుకు బయట ఎక్కడా భోజనం చేయడు కనుక తల్లే వండిపెట్టేదట! రాను రాను, శాస్త్రసాంకేతిక విజ్ఞానాల చేతిలో మనుషులు మరబొమ్మలయ్యారు. బంధుత్వాలూ, స్నేహాలూ ముఖాముఖీ అభివ్యక్తికి దూరమై మొబైల్ తెరకు పరిమితయ్యే పలకరింపులవుతున్నాయి. సాహిత్య రంగానికే వస్తే, 'పాట' దశను దాటి 'రాత' దశకు చేరడాన్ని పురోగమనంగా చెప్పుకోవడం పరిపాటి అయింది. కానీ నిజానికి పాటే కాదు, ఆట కూడా సమూహ చింతన నుంచి, సమష్టి చైతన్యం నుంచి పుడితేబీ రాత వైయక్తిక స్పందన నుంచి పుట్టింది. సమూహం నుంచి విడివడి మనిషి ఒంటరి అయ్యే ఆ పరిణామాన్ని పురోగమనమనాలో, తిరోగమనమనాలో తేల్చుకోలేక పోవడమే మానవ జీవనంలోని మహా వైచిత్రులలో ఒకానొకటి. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడూ/మచ్చుకైనా లేడు చూడూ' అనే పాట కొద్ది రోజులుగా తెలుగునాట వాడవాడలా వినిపిస్తూ, గుండె గుండెనూ తట్టిలేపడం చూశాం. తనే నిలువెత్తు పాటగా మారి, జనంలోకి వెళ్ళి, మనిషి మనిషిలో మోగి హఠాత్తుగా మన మధ్య నుంచి మాయమైన మనకాలపు పాటల గంధర్వుడు అందెశ్రీ కట్టిన పాట అది. 'ఆత్మీయ బంధాల ప్రేమ సంబంధాల దిగజారుతున్నడోయమ్మా... అవసరాలకు మనిషి సృష్టించిన రూపాయి చుట్టూ తిరుగుతున్నడమ్మా... కదిలె విశ్వం తనా కనుసన్నలో నడువా, కనుబొమ్మ లెగరేసి కాలగమనం లోన' మనిషి మాయమై పోతున్నడమ్మా అని హెచ్చరిస్తున్న ఆ పాట నిజానికి సందేశ పరంగా మానవ జాతీయ గీతాలలో ఒకటి కాదగినదీ, విశ్వవేదిక మీద వినిపించవలసినదీ.

# తెలంగాణలో మొదలవుతున్న పంచాయితీ !

హైదరాబాద్,పంచాయితీ ఎన్నికలే లక్ష్యంగా అధికార పార్టీల పావులు కదుపుతోంది. రెండుమూడు రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కొడంగల్ సభలో స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే ఇందిరమ్మ చీరల పంపిణీ మొదలయ్యింది. ఊరూవాడా ఈ జాతర సాగుతోంది. మంగళవారం నుంచి మహిళలకు వడ్డీరహిత రుణాల జాతర మొదలయ్యింది. నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ పనిలో పడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారం మరోవైపు సాగుతోంది. ఇదంతా కేవలం పంచాయితీ ఎన్నికల కోసమే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ క్రమంలో బిసి రిజర్వేషన్లు వెనక్కి పోయాయి. పార్టీపరంగా 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారు. ఉరిమురిమి మంగళం మీద పడ్డట్లు రిజర్వేషన్లు అమలు కాకపోవ డానికి బిజెపి కారణమని తప్పించుకోజూస్తున్నారు. 42శాతం రిజర్వేషన్ల హామీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. దానిని ఎలా అమలు చేస్తారో కూడా తెలియకుండా నానా రకాల ఫీట్లు చేసి, చివరకు కోర్టుల్లో భంగపాటుకు గురయ్యారు. కేంద్రం ఆమోదించకపోవడం వల్లనే ఇలా జరిగిందని సాకులు చూపారు. నిజంగానే రిజర్వేషన్ల వ్యవహారం ఎలా ఉంటుందో తెలియంది కాదు. 50 శాతనకు మించి రిజర్వేషన్లు అమలు చేయడం కుదరదు. దీనికి నిబంధనలు ఉన్నాయి. అవన్నీ పక్కన పెట్టి లాయర్లకు, కోర్టులకు డబ్బులు తగలేసి, చివరకు ఎన్నికలు ఆసల్యంగా జరపడానికి సిద్దం అయ్యారు. అదికూడా నిధులు రాకపోతే ఎలా అన్న మీమాంసలో ముందుకు వెళ్లడం తప్ప చిత్తశుద్దితో కాదు. పంచాయితీల పాలన ముగిసి దాదాపు రెండేళ్లు కావస్తోంది. ఈ క్రమంలో బిసి రిజర్వేషన్ల పేరిట నానా హంగామా చేసి, ఇప్పుడు మళ్లీ పాతపద్దతి లోనే పంచాయితీ ఎన్నికలకు సిద్దం అయ్యారు. మొత్తంగా ఇదంతా ఊహించినట్టే జరిగింది. 42 శాతం కోటా పేరిట ఊదరగొట్టి.. చివరికి పాత పద్ధతిలో 25 శాతానికి బీసీ కోటాను పరిమితం చేసి ఎన్నికలకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. ఇకపోతే బిసి కులగణన పేరుతోనూ నానా విధాలుగా వక్రీకరణలు జరిగాయి. అసలు సర్వే సంపూర్ణంగా సాగలేదు. 1948 చట్టం ప్రకారం జనాభా గణన చేపట్టే అధికారం కేంద్రానికి మాత్రమే ఉన్నది. ఎలాంటి జనగణన నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు లేవు. ఒకవేళ చేసినా ఆ గణాంకాలకు చట్టబద్ధత ఉండకపోవడమేగాక, అమలు చేసే అవకాశం కూడా లేదు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వమే గణాంకాల సేకరణ చట్టం-2008 ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు డాటా సేకరణకు కొన్ని పరిమిత అధికారాలను బదలాయించింది. ఒకవేళ రాష్ట్రం నిర్వహించాలని భావించినా అందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అంతేకాదు, సేకరించిన డాటా వెల్లడిపై కూడా అనేక ఆంక్షలను విధించింది. రాష్ట్ర ప్రభుత్వం పేరుకు ఇంటింటి సర్వే అని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా జనాభాగణననే నిర్వహించి అందరినీ మభ్యపెట్టిందని విపక్షాలు ఇప్పటికే ఆరోపించాయి. కేంద్రం సర్వేకు అంగీకరించడంతో అదీ తమ ఘనతే అని చెప్పు కున్నారు. కేంద్రం మెడలు వంచామని బుకాయించారు. రాహుల్ నామ జపంతో సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల రిజర్వేషన్ల ఖరారులో పూర్తి గందరగోళం నెలకొన్నది. సర్కారు జారీచేసిన మార్గదర్శ కాలకు విరుద్ధంగా జిల్లాల్లో ఎక్కడికక్కడ అధికారులు ఇష్టారీతిన రిజర్వేషన్లను ఖరారు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. తొలిదశలో నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు ఎస్సీ, ఎస్టీలు ఒక్కరూ లేనిచోట కూడా ఆ వర్గాలకు స్థానాలను రిజర్వ్ చేయడం,




పూర్తిగా ఎస్టీలే ఉన్నచోట ఇతర వర్గాలకు రిజర్వ్ చేయడం చూశాం. ఇప్పుడు కూడా అలాంటి విమర్శలే వస్తున్నాయి. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 50 శాతానికి మించకుండా ఎస్టీ, ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో-46ను విడుదల చేసింది. సర్పంచ్ స్థానాలకు ఆర్డీవోలు, వార్డు మెంబర్ల స్థానాలకు ఎంపీడీవోలు రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉన్నది. రిజర్వేషన్లను ఏప్రాతిపదికగా నిర్ణయించాలో సర్కారు మార్గదర్శ కాల్లో పేర్కొన్నది. జనాభా దామాషా ప్రకారం తొలుత ఎస్టీ, ఎస్సీ, బీసీ, తదుపరి మహిళా స్థానాలను ఖరారు చేయాల్సి ఉన్నది. ఆయా స్థానాలకు అనుగుణంగా గ్రామం, మండలం, జిల్లా, ఆపై రాష్ట్రం యూనిట్‌గా నిర్దేశిత కోటా ప్రకారం స్థానాలను రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. సగం కంటే ఎక్కువ ఏ జనాభా ఉంటే ఆ వర్గానికి మొదటి ప్రాధాన్యంగా స్థానాలను రిజర్వ్ చేస్తూ వెళ్తుంటారు. ఇదీ ఆయా స్థానాల రిజర్వేషన్లకు అనుసరించే పక్రియ. ఎప్పుడూ ఇదే పద్దతిని అవలంబిస్తున్నారు. షెడ్యూల్డ్ ఏరియాలోనూ ఎస్టీలకు మొత్తం స్థానాల్లో సగానికి తగ్గకుండా ఉండాలి. వందశాతం ఎస్టీ జనాభా ఉన్నచోట మొత్తంగా వారికే కేటాయించాల్సి ఉంటుంది.ఇదిలా ఉంటే వార్డు మెంబర్ స్థానాలకు ఇంటింటి సర్వే-2024 లెక్కలను, సర్పంచ్ స్థానాలకు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని, ఇంటింటి సర్వే-2024 లెక్కలను పరిగణనలోకి తీసుకుని బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో రిజర్వేషన్ల కేటాయింపు మొత్తంగా గందరగోళంగా మారిందని తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా సీట్లను అలాట్ చేశారనే విమర్శలొస్తున్నాయి. అనేకచోట్ల గందరగోళంగా జరిగిందంటూ ఆశావహులు ఇప్పటికే అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్లలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతున్నదని బీసీ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు జిల్లాల్లో సర్పంచ్, వార్డుమెంబర్ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. అన్ని జిల్లాల్లో బీసీ కోటాను తగ్గించి జనరల్ కోటను పెంచారని బీసీ సంఘాలు చెప్తున్నాయి. రొటేషన్ ముసుగులో బీసీలకు రావాల్సిన సర్పంచ్ స్థానాలను అగ్రకులాలకు కట్టబెడుతున్నారని మండిపడుతున్నాయి. మొత్తంగా ఇప్పుడు వస్తున్న విమర్శలు, ఆందోళనలకు ప్రభుత్వం సమాధానం ఇచ్చుకోవాలి. అలాగే పారదర్శకంగా రిజర్వేషన్ల అమలు, ఎన్నికల నిర్వహణ జరగాలి. అప్పుడే ప్రభుత్వ నిజాయితీ కనిపిస్తుంది.

# సైబర్ మోసాలకు ఏఐ విరుగుడు



న్యూఢిల్లీ,టెలికమ్యూనికేషన్లు, ఇంటర్నెట్ వినియోగదారులపై రకరకాలుగా వల విసురుతున్న సైబర్ నేరగాళ్లు భారీ స్థాయిలో ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. డిజిటల్ అరెస్టుల పేరిట దోచుకుంటున్నారు. ఇలాంటి మోసగాళ్లకు కృత్రిమ మేధ (ఏఐ) బాగా ఉపకరిస్తోంది. ఇప్పుడీ ఉపద్రవాన్ని ఎదుర్కోవడం టెలికం రంగం ముందున్న పెద్ద సవాలు. అయితే, ఈ సమస్యను ఎదుర్కోవడానికి ఏఐనే ఆయుధంగా మార్చుకోవాల్సి ఉంది. మానవ మేధతో చేసే పనులను యంత్రాలతో, అల్గొరిథమ్‌లతో చేయించడానికి తోడ్పడేదే ఏఐ. యంత్రాల్లో మానవ మేధను పోలిన నైపుణ్యాన్ని చొప్పించడం ఏఐ పని. అది ఇప్పటికే మానవుడికి తెలిసినదానికి మరింత పదునుపెట్టి ఉపయోగించుకోవడానికి తోడ్పడుతుందే తప్ప తెలియనిదాన్ని, కొత్త విషయాలను ఆవిష్కరించలేదు. మనిషి చాలా శ్రమించి, ఎంతో జాగ్రత్తగా చేయాల్సిన పనులను ఏఐ వేగంగా అవలీలగా చేసేయగలదు. అయితే, అవి ఎక్కువగా రొటీన్‌గా చేసే పనులే ఉంటాయి. డబ్బు, అధికారాలను మంచికీ చెడుకీ ఉపయోగించగలిగినట్లే- ఏఐని నిర్మాణాత్మక కార్యాలకూ, వినాశకర పనులకూ వాడొచ్చు. ఈ క్రమంలోనే సైబర్ నేరగాళ్లు జనాన్ని లాఘవంగా దోచుకోవడానికి ఏఐని దుర్వినియోగం చేస్తున్నారు. అయితే, అలాంటి నేరగాళ్ల ఆట కట్టించడానికి కృత్రిమ మేధ అంతకన్నా సమర్థంగా ఉపకరిస్తుంది.

### డిజిటల్ ఇంటెలిజెన్స్...

కేంద్ర టెలికం విభాగంలో వైర్‌లెస్ ప్లానింగ్, సమన్వయ విభాగ ఛత్రం కింద రేడియో ఫ్రీక్వెన్సీలను కేటాయించే స్థాయీ సలహా సంఘం(శాక్ఫా) ఒకటుంది. అది టెలికం స్పెక్ట్రమ్ నిర్వహణకు, అనుమతుల ప్రక్రియ వేగవంతానికీ ఏఐని ఉపయోగిస్తోంది. భారతదేశంలో వైర్‌లెస్ సర్వీసులకు గిరాకీ పెరిగిపోతున్న ఈ సమయంలో శాక్ఫా తన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తోంది. దేశంలో వినియోగదారుల సంఖ్య ఎక్కడ ఎక్కువగా ఉందో నిర్ధారించి అక్కడ కొత్త సెల్ టవర్ల ఏర్పాటుకు ఏఐ తోడ్పడుతుంది. టెలికం టవర్ల పరిస్థితి ఎలా ఉందో కనిపెట్టడానికి ఏఐ చోదిత డ్రోన్లు ఉపకరిస్తాయి. స్మార్ట్ స్పెక్ట్రమ్ మేనేజ్‌మెంట్‌కు ఏఐ కీలకమవుతుంది. విమానాశ్రయాల దగ్గర్లో ఎంత ఎత్తులో టవర్లు నిర్మించాలో ఏఐ సలహాలిస్తుంది. తద్వారా విమాన ప్రమాదాలను నివారిస్తుంది. నెట్‌వర్క్ పనితీరు సమర్థంగా ఉండేలా చూడటానికీ, విద్యుత్ కోత, అంతరాయాల గురించి ముందే హెచ్చరించడానికీ, నివారించడానికి కూడా ఏఐ తోడ్పడుతుంది. ఖాతాదారులకు ప్రత్యేక సేవలు అందించడమే కాదు, వైర్‌లెస్ నెట్‌వర్క్‌లపై సైబర్ దాడులను అడ్డుకుంటుంది. ఫోర్జరీని, నకిలీ పత్రాలతో ఫోన్ కనెక్షన్లను తీసుకున్నవారిని వేగంగా కనిపెట్టడానికి టెలికం విభాగం ఏఐ, బిగ్‌డేటాలను ఉపయోగిస్తోంది. 2025 ఆగస్టులో అలా 82 లక్షల కనెక్షన్లను గుర్తించి తొలగించింది. సైబర్ నేరగాళ్లు భారతీయ ఫోన్ నంబర్లతో విదేశాల నుంచి కాల్స్ చేసి మనవాళ్లను మోసగిస్తున్నారు. ఆ కాల్స్‌ను గుర్తించి నిరోధించే పద్ధతిని టెలికం శాఖ, టెలికం సర్వీస్ ప్రొవైడర్లు రూపొందించారు. ఇలాంటి నేరాలను నివారించడానికి టెలికం విభాగం డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాం(డీఐపీ)ను ప్రారంభించింది. ప్రస్తుతం రిజర్వు బ్యాంకుతోపాటు పలు బ్యాంకులు, పోలీసు, భద్రతా విభాగాలు, టెలికం సర్వీసు ప్రొవైడర్లు (టీఎస్పీ), ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ)తోపాటు మొత్తం 540 సంస్థలు డీఐపీలో చేరాయి. సైబర్ నేరాల గురించి హెచ్చరించడానికి టెలీకమ్యూనికేషన్ల విభాగం టెలికం సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (టీఎస్‌వోసీ)ను నెలకొల్పింది. ఫిషింగ్ కాల్స్, నకిలీ ఎస్ఎంఎస్‌లను నిరోధించడానికి ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లను ఉపయోగించాల్సిందిగా ట్రాయ్ టెలికం కంపెనీలకు సూచించింది. 2020 జనవరి 10న ప్రారంభమైన ఐ4సీ సైబర్ నేరాలపై పోరులో పోలీసు, ఇతర భద్రతా సంస్థలతో చేతులు కలిపి పనిచేస్తోంది.

టీఎస్పీలు నియోగించిన ఏఐ యంత్రాంగం 2024సెప్టెంబరు-2025జూన్ మధ్య 4,830 కోట్ల స్పామ్ కాల్స్‌ను గుర్తించి, 3.20లక్షల బోగస్ లింకులను అడ్డుకుంది. 2025 సెప్టెంబరు నుంచి ఆర్ జియో, ఎయిర్ టెల్ సంస్థల ఏఐ ఆధారిత యంత్రాంగాల చలవతో ఖాతాదారులకు సైబర్ మోసాల వల్ల నష్టాలు 68.7 శాతం తగ్గాయి. మరో టెలికం సంస్థ వీఐ 25 కోట్ల మోసపూరిత ఎస్ఎంఎస్‌లను అడ్డుకుంది. 2025 మధ్య నుంచి బీఎస్ఎన్ఎల్ జాతీయ యాంటీ స్పామ్, యాంటీ ఫిషింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టింది. బీఎస్ఎన్ఎల్‌తో క్లౌడ్ కమ్యూనికేషన్ల ప్రొవైడర్ టాన్లా చేతులు కలిపింది. టెలికం రంగంలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలన్నీ సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి తమ స్థాయిలో కృషి చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం కాలర్ ఐడీ, కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ (సీనాప్) సౌకర్యాలను ప్రవేశపెట్టనుంది.

### పెట్టుబడులు అవసరం

ఈ ఏడాది అక్టోబరులో దిల్లీలో జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ- ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, 6జీ, శాటిలైట్ కమ్యూనికేషన్లు, టెలికం, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ ఉత్పత్తిలో, సైబర్ నేరాల నిరోధంలో భారత్ పురోగతిని వివరించారు. డిజిటల్ అంతరాలను అధిగమించడానికి ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ కల్పించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఏదిఏమైనా ఏఐలో భారతీయ టెలికం రంగం పురోగమించాల్సింది ఎంతో ఉంది. ఏఐ మౌలిక వసతుల సృష్టికి భారీ పెట్టుబడులు అవసరం. ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లలో నిపుణ సిబ్బంది కొరతను తీర్చాలి. 2024లో సైబర్ మోసాల వల్ల భారతీయులు సుమారు రూ.22,845 కోట్లు నష్టపోయారు. అంతకుముందు ఏడాదిలో కోల్పోయింది రూ.7,465 కోట్లు. అంటే ఒక్క ఏడాదిలో 206 శాతం ఎక్కువ సొమ్మును మోసగాళ్లు కాజేశారన్న మాట. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ ఏడాది భారతీయులు నష్టపోయే మొత్తం రూ.1.2 లక్షల కోట్లకు పైగానే ఉంటుందని కేంద్ర హోంశాఖ తెలిపింది. ప్రభుత్వం, మీడియా సంస్థలు ఎంతగా హెచ్చరిస్తున్నా విద్యావంతులు కూడా సైబర్ నేరగాళ్ల బారిన, డిజిటల్ అరెస్టుల ఉచ్చులో చిక్కుకుంటుండటం శోచనీయం. ఇలాంటి మోసాలను ముందుగానే గుర్తించి నివారించడానికి ఏఐని మరింత సమర్థంగా ఉపయోగించాల్సిన అవసరం ఉంది.

# మలక్కా ప్రాంతంలో అల్పపీడనం కేంద్రీకృతం

విశాఖపట్నం,బంగాళాఖాతంలో నెలకొంటున్న పరిస్థితులు వాతావరణ నిపుణులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఒక అల్పపీడనం కొనసాగుతుండగానే.. మరోటి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ రెండు అల్పపీడనాలూ మనుగడ కోసం పోటీ పడనున్నాయి. రాబోయే రోజుల్లో రెండూ కలిసిపోయే అవకాశముంది. మలక్కా జలసంధి సమీపంలో ప్రస్తుతం తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి వాయుగుండంగా, గురువారంలోగా తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ఇది తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంపై మరోసారి వరణుడు తన ప్రతాపం చూపనున్నాడు. ఈనెలాఖరున రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. మలక్కా జలసంధి ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. రాగల 6 గంటల్లో ఇది పశ్చిమ - వాయవ్య దిశగా కదులుతూ అదే ప్రాంతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. ఆ తదుపరి 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో తుఫానుగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఉపరితల ఆవర్తన ప్రభావంతో కొమోరిన్, నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక పరిసర ప్రాంతాల్లో మరో అల్పపీడనం ఇప్పటికే కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పింది. రాబోయే 24 గంటల్లో అల్పపీడనం బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో శనివారం నుంచి మంగళవారం వరకు కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు... పలు చోట్ల భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి రావాలని అధికారులు సూచించారు. వర్షాల నేపథ్యంలో రైతులకు కూడా వాతావరణ అధికారులు కీలక సూచనలు చేశారు. మరో మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. అయితే తుఫాన్ తదుపరి కదలికలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. గత గణాంకాల ప్రకారం.. నవంబరులో ఏర్పడే తుపాన్లు చాలావరకు పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ వైపు వెళుతుంటాయి. కొన్ని మాత్రం ఏపీ, తమిళనాడు తీరాలను తాకాయి. సాధారణంగా అల్పపీడనం ఏర్పడ్డాక దాని గమనంపై దాదాపు స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు దీనిపై సరైన స్పష్టత లేదని, తుపానుగా బలపడిన తర్వాతే దీని దిశ, గమనం, తీరాన్ని తాకే కేంద్రంపై అంచనాకు రాగలమని నిపుణులు తెలిపారు.కొమొరిన్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం నైరుతి బంగాళాఖాతంలో కొమొరిన్, శ్రీలంక పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని ఐఎండీ తెలిపింది. తర్వాత ఇది మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. వీటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండీ తెలిపింది. 29న రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు, 30న బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. ఇప్పటికే వెళ్లిన మత్స్యకారులు గురువారం లోగా ఒడ్డుకు చేరుకోవాలని విజ్ఞప్తి చేసింది. మలక్కా జలసంధి సమీపంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా బలపడుతుందని, ఈ నెల 30 నాటికి బలహీనడపతుందని పలు వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. కొమొరిన్ ప్రాంతంలో ఏర్పడనున్న అల్పపీడనం తర్వాత బలపడుతుందని, డిసెంబరు 1 నాటికి తమిళనాడు, దక్షిణ కోస్తా మధ్యలో తీరం దాటుతుందని సూచిస్తున్నాయి.

# కేడర్ లో అంతర్మథనం!

అమరావతి,ఏపీలో స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు మొదలుపెట్టింది. 175 నియోజకవర్గాల్లోని పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. మార్చిలో పదో తరగతి పరీక్షలు పూర్తయిన తర్వాత పంచాయతీలకు ఆ తర్వాత కొంత సమయం తీసుకుని మున్సిపాలిటీలు, ఆ వెంటనే మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్లాన్ చేస్తోంది. దీంతో రాష్ట్రంలో అప్పుడే పొలిటికల్ హీట్ పెరిగిపోయింది. ఏ ఇద్దరు కార్యకర్తలు కలుసుకున్నా కూడికలు, తీసివేతలు వేసుకుంటూ లెక్కలు వేస్తున్నారు. అధికారం చేతిలో ఉందనే ఉత్సాహంతో టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు కదన కుతూహలం ప్రదర్శిస్తున్నాయి. ఇదే సమయంలో వైసీపీలో నిశ్శబ్దం రాజ్యమేలుతోందని అంటున్నారు. ఆ పార్టీలో ఏ ఒక్కరు స్థానిక ఎన్నికల కోసం మాట్లాడటం లేదని అంటున్నారు.గతంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో వైసీపీ రాష్ట్రంలో 99 శాతం స్థానాలను కైవసం చేసుకుంది. అప్పట్లో అధికారం అండతో మెజార్టీ స్థానాల్లో ఏకగ్రీవం అయ్యేలా ఆ పార్టీ నేతలు చక్రం తిప్పారని అంటున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీలో నాయకులు, కార్యకర్తలు పూర్తిగా డీలా పడిపోయినట్లు కనిపిస్తున్నారు. చాలా మంది గతంలో తాము వ్యవహరించిన విధానాలను గుర్తుకు తెచ్చుకుని.. ఇప్పుడు అధికార పార్టీ అదే తరహా రాజకీయం చేస్తుందా? అని సందేహిస్తున్నారు. అలా అయితే తాము అధికార కూటమిని ఎలా ఎదుర్కోగలమని అంతర్గత భేటీల్లో చర్చించుకుంటున్నారని అంటున్నారు.గతంలో ఏకపక్ష విజయాలను సాధించిన వైసీపీ.. ఇప్పుడు కనీసం పోటీ ఇచ్చే పరిస్థితి ఉందా? అన్న చర్చ జరుగుతోంది. ఎందుకంటే స్థానిక ఎన్నికలపై ఆ పార్టీ అధిష్టానం నుంచి గానీ, జిల్లా, నియోజకవర్గ స్థాయి నేతల నుంచి కానీ ఇంతవరకు ఎలాంటి ముందస్తు సన్నాహాలు కనిపించడం లేదు. కనీసం స్థానిక ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలనే విషయమై నియోజకవర్గ స్థాయిలో కనీసం ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని అంటున్నారు. పార్టీలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు నడుచుకుంటుండటం వల్ల.. గ్రామస్థాయిలో అధికార పార్టీతో పోరాటంపై వైసీపీ కేడర్ డైలమాలో పడిపోతోందని అంటున్నారు.ఇక రాయలసీమ, పల్నాడు వంటి ప్రాంతాల్లో ఫ్యాక్షన్ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో తాము నామినేషన్ వేసే అవకాశం కూడా ఉండకపోవచ్చని వైసీపీ కార్యకర్తలు ముందే కాడి వదిలేస్తున్న సంకేతాలిస్తున్నారని అంటున్నారు. పార్టీ అధిష్టానం అండ లేకపోతే స్థానిక ఎన్నికలపై తాము ఒక్క అడుగు ముందుకు వేయలేమని వైసీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే అధినేత జగన్ మాత్రం అసలు స్థానిక ఎన్నికలను ఏ మాత్రం సీరియస్గా తీసుకున్నట్లు కనిపించడం లేదని అంటున్నారు. గతంలో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలతోనే ఎన్నికలు నిర్వహించాలని, అప్పుడే ప్రతిపక్షానికి రక్షణ ఉంటుందని జగన్ వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో అధికార పార్టీ స్పీడుతో సొంత స్థానాన్ని కూడా జగన్ నిలుపుకోలేకపోయారని అంటున్నారు. ఇది గుర్తించుకున్న వైసీపీ కేడర్.. వచ్చే స్థానిక ఎన్నికల్లో ఇంతకుమించు అదే విధంగా జరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. దీంతో స్థానిక సమరం వైసీపీ కేడర్ ను తీవ్ర అంతర్మథనానికి

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

మంచిర్యాల, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో గల టీ కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కుంబాల రాజేష్ (32) అనే వ్యక్తి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేష్ తన భార్య మౌనిక కూతురు అద్విక, కుమారుడు మణివర్షిత్ లతో కలిసి ద్విచక్రవాహనం పై లక్షెటిపేటలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో పాత మంచిర్యాలకు రాగానే ఎదురుగా వస్తున్న గుడిపేటకు చెందిన దుర్గం సంతోష్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో బలంగా ఢీ కొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయలపాలైన రాజేష్, తన కూతురు అద్వికలను మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స ను అందించినట్లు పేర్కొన్నారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం రాజేశ్ ఉదయం మృతి చెందినట్లు వివరించారు.

# జిహెచ్ఎంసి సమావేశంలో గందరగోళం

హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మంగళవారం తీవ్ర గందర గోళం నెలకొంది. వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాల ఆలాపన సమయంలో మజ్లిస్ కార్పొరేటర్లు కుర్చీలో నుంచి లేవలేదు. దీంతో బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వందేమాతర గీతం పాడితేనే దేశంలో ఉండాలంటూ వారు బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో బీజేపీకి వ్యతిరేకంగా ఎంఐఎం కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ఇరు పార్టీల కార్పొరేటర్లు.. ఈ సమావేశంలో టేబుల్స్ ఎక్కి హంగామా చేశారు. దాంతో మార్షల్స్ రంగంలోకి దిగి.. వారిని బయటకు తీసుకు వెళ్లే ప్రయత్నం చేశారు. సభ సజావుగా జరిగేలా సహకరించాలంటూ కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఈ రెండు పార్టీల కార్పొరేటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు జరుగుతున్న జీహెచ్ఎంసీ పాలక మండలి తుది సమావేశం. మరో రెండున్నర నెలల్లో ప్రస్తుత పాలక వర్గం గడువు ముగియనుంది. ఈ సమావేశంలో 95 ప్రశ్నలు, 45 అజెండ అంశాలపై చర్చించాల్సి ఉంది. ఈ తుది సమావేశానికి జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతోపాటు సిటీలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ప్రారంభానికి ముందె రభస మొదలైంది. పారిశ్రామిక వాడల భూములను అమ్మేలా రూపొందించిన పాలసీని రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ కార్యాలయానికి నిరసన తెలుపుతూ ర్యాలీగా వెళ్లారు. రూ.5 లక్షల కోట్ల విలువైన 9,292 ఎకరాల భూములను అమ్మేస్తూ.. రేవంత్ రెడ్డి సర్కార్ దేశంలోనే అతిపెద్ద స్కామ్‌కు తెరలేపిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇండస్ట్రియల్ కారిడార్ భూములను అమ్ముతున్న పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

## మదర్సాలపై సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,ఢిల్లీలో ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడి నేపథ్యంలో గత కొద్ది రోజులుగా దేశంలో మదర్సాలపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన మదర్సాల్లో ముస్లింలకు దేశంపై విషం నింపుతున్నారని, ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ.. మదర్సాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదుల దాడిలో హిందువులే కాకుండా ముస్లింలు కూడా చనిపోయారని, భారత దేశానికి శత్రువులు అయిన వారు ముస్లింలకు శత్రువులు అవుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మదర్సాలలో కనీసం గదులు నిర్మించలేని వారు.. బాంబులు తయారు చేయడం నేర్పిస్తున్నారని, ఇది క్షమించరాని నేరమని, దేశద్రోహులు 14 మంది అమాయకుల ప్రాణాలు బలిగొన్నారని, ఉన్నత చదువులు చదివి బాంబులు తయారు చేసి మతానికి చెడ్డపేరు తెస్తున్నారంటూ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు.

# బీజేపీ టార్గెట్ ఇదే

పాట్నా:బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన బీజేపీ.. వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో జరగనున్న పశ్చిమ్ బెంగాల్‌లోనూ కాషాయ జెండాను ఎగరువేయాలనే కృతనిశ్చయంతో ఉంది. మమతా బెనర్జీ, ఆమె పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని, బీజేపీ ఎన్నికల యంత్రాంగం అప్పుడే కార్యాచరణ మొదలుపెట్టింది. బెంగాల్‌లో వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతాయని, బీహార్ విజయం ఇచ్చిన అత్మవిశ్వాసంతో దీదీని గద్దె దింపడానికి వ్యూహరచన చేసినట్టు ఆ పార్టీ వర్గాలు సోమవారం తెలిపాయి. కానీ కేవలం బీజేపీ ప్రధాన దృష్టంతా మమతా బెనర్జీపై మాత్రమే కాదని, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీని వ్యతిరేకించే తృణమూల్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటుందని పేర్కొన్నాయి. వీలైనంత మేర టీఎంసీకి ఉన్న ఆదరణను తగ్గించడమే దీని లక్ష్యం. అయితే, తృణమూల్ అధినేత్రిని విస్మరించాలని కాదు. దీంతో పాటు ఎప్పటి మాదిరిగానే వారసత్వ రాజకీయాల అంశంపై కూడా బీజేపీ దృష్టి సారిస్తుంది. మమతా బెనర్జీ రాజకీయ వారసుడు ఆమె మేనల్లుడని ప్రచారం జరుగుతుండగా... ప్రజల్లో ఆయనపై అంతగా సానుకూలత లేదనే సంకేతాలు వస్తున్నాయి. ఈ పరిస్థితి తమకు అనుకూలంగా మారి, క్షేత్రస్థాయి వనరులను తమవైపు తిప్పుకునేందుకు అవకాశం కల్పిస్తుందని పార్టీ వ్యూహం గురించి తెలిసిన ఓ బీజేపీ నేత అన్నారు.కాగా, 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు సువేందు అధికారి సహా టీఎంసీకి చెందిన ముఖ్య నేతలు బీజేపీలో చేరారు. దీదీకి కుడి భుజమైన సువేందు.. పార్టీలో అభిషేక్ పెత్తనాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతాను సువేందు ఓడించిన విషయం తెలిసిందే. కానీ, ఈసారి మాత్రం టీఎంసీకి చెందిన అసమ్మతి నేతలను పార్టీలోకి చేర్చుకునే ప్రణాళిక లేదని, దీని వల్ల పార్టీ ఓటు శాతం గణనీయంగా పెరుగుతుందని ఆశించడంలేదని వారు పేర్కొన్నారు.దీనికి బదులు టీఎంసీ కార్యకర్తలను చేర్చుకుంటే బీజేపీ ఇంకా దూకుడుగా, మరింత సమర్థవంతంగా ఎన్నికల్లో ముందుకెళ్తుందని భావిస్తున్నారు. అంతేకాదు, పార్టీలో కొత్త నాయకులను చేర్చుకోవడం వల్ల ఇప్పటికే ఉన్నవారిని పక్కనబెట్టాల్సి వస్తుందని, కార్యకర్తలను చేర్చుకుంటే ఆ పరిస్థితి ఉండదని అంటున్నారు. బిహార్‌లో బీజేపీ, జేడీయూ సహా దాని మిత్రపక్షాలు కుల సమీకరణాలను సరిగ్గా అమలు చేసి విజయం సాధించాయి. కానీ, బెంగాల్‌లో పరిస్థితి దీనికి విరుద్ధం. ఇతర రాష్ట్రాలతో పోల్చితే అక్కడ కుల రాజకీయాలకు అంతగా ఆస్కారం లేదు. అందుకే ఇక్కడ బీజేపీ ప్రాంతీయ, మత సమీకరణాలపై ఫోకస్ పెట్టింది.

హిందూ-ముస్లిం సమీకరణాలు

బెంగాల్‌లో ముస్లిం జనాభా సుమారు 30 శాతంగా ఉంటుంది. కానీ, కేవలం 30 నుంచి 40 స్థానాల్లోనే వీరి ప్రభావం ఉంటుంది. బీజేపీ విశ్లేషణ ప్రకారం.. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో టీఎంసీకి గణనీయంగా ఓట్లు వస్తాయి.

# తేజస్ డౌట్స్! తప్పిదమా? లోపమా?

న్యూఢిల్లీ,ఎస్.. మన తేజస్ కూలింది. అయితే.. ఇదేం మొదటిసారి కాదు. రెండేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే.. తేజస్ ఫైటర్ జెట్ కూలడం ఇది రెండోసారి. దుబాయ్ ఎయిర్ షోలో కూలడంతోనే.. ఇంత చర్చ. అసలు.. తేజస్ ఎలా కూలింది? విన్యాసాలు చేస్తుండగానే.. ఉన్నట్టుండి ఎలా నేలని ఢీకొట్టింది? ఇది.. పైలట్ తప్పిదమా? ఫైటర్ జెట్‌లో ఉన్న లోపమా? ఈ తేజస్ క్రాష్ గురించి.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ టెన్షన్ పడాల్సినంత అవసరముందా?

దుబాయ్ ఎయిర్ షోలో కూలిన తేజస్ ఫైటర్ జెట్

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన.. స్వదేశీ యుద్ధ విమానం తేజస్ దుబాయ్ ఎయిర్ షోలో కూలిపోవడం.. దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. రెండేళ్ల కంటే తక్కువ వ్యవధిలో తేజస్ కూలిపోవడం ఇది రెండోసారి. దాంతో.. ఈ లైట్ కాంబాట్ ఫైటర్ జెట్ సామర్థ్యం, భవిష్యత్తుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనికి కారణాలు ఏమై ఉండొచ్చనే చర్చ కూడా ఇప్పుడు మొదలైంది. దుబాయ్‌లో ఇంటర్నేషనల్ ఎయిర్‌షోలో విన్యాసాలు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో పైలట్, వింగ్ కమాండర్ నమాంశ్ సయాల్ కూడా మృతిచెందినట్లు.. భారత వాయుసేన ప్రకటించింది. ప్రమాదానికి దారితీసిన కారణాలను పూర్తి స్థాయి విచారణ తర్వాతే తెలుస్తాయని స్పష్టం చేసింది. ఇందుకోసం.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్.. కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీని నియమించింది.

విన్యాసాలు చేస్తుండగా నేలని ఎలా ఢీకొట్టింది?

తేజస్ ఫైటర్ జెట్ ఏరియల్ డిస్‌ప్లేలో భాగంగా విన్యాసాలు చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఓ అసాధ్యమైన స్టంట్ చేయడం, క్షణం పాటు నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందంటున్నారు. యుద్ధ విమానం వేగంగా నేలపైకి దూసుకొచ్చి.. నేలని తాకిన మరుక్షణమే భారీ పేలుడు సంభవించింది. దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. చాలామంది నిపుణుల ప్రకారం.. తేజస్ యుద్ధ విమానం నెగటివ్ జీ-ఫోర్స్ టర్న్ స్టంట్ పూర్తి చేసి.. తిరిగి సాధారణ స్థితికి మళ్లించే క్రమంలో నియంత్రణ కోల్పోయినట్లు చెబుతున్నారు. ఈ స్టంట్ చేసేటప్పుడు.. పైలట్ కొన్ని క్షణాల పాటు తలకిందులుగా ఉంటాడు. ఆ సమయంలో.. అధిక జీ-ఫోర్స్ కారణంగా తలవైపు రక్త ప్రసరణ పెరిగి.. పైలట్ గందరగోళానికి గురవడం గానీ, తాత్కాలికంగా గురుత్వాకర్షణ వల్ల స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ క్లిష్టమైన విన్యాసం నుంచి విమానాన్ని సాధారణ స్థితికి మళ్లించే క్రమంలో.. ఎత్తు తక్కువగా ఉండటం, వేగం సరిపోకపోవడం వల్ల.. పైలట్ ఆలస్యంగా రియాక్ట్ అవడం గానీ, కంట్రోల్ తప్పడం గాని జరిగి ఉండొచ్చంటున్నారు. వింగ్ కమాండర్ నమాంశ్ సయాల్ అనుభవం కలిగిన పైలట్ అయినప్పటికీ.. విన్యాసం చేస్తున్న సమయంలో జరిగిన చిన్న పొరపాటు వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రమాదం పైలట్ తప్పిదమా?

విమానం కూలిపోవడానికి ముందు.. తేజస్ ఇంజన్ ఒక్కసారిగా పవర్ లాస్ అవడం, ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్‌లో ఏదైనా టెక్నికల్ లోపం తలెత్తి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదం జరగడానికి కొన్ని గంటల ముందు.. దుబాయ్ ఎయిర్ షోలో పాల్గొన్న తేజస్ విమానం నుంచి ఆయిల్ లీక్ అవుతోందని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే.. అది సాధారణ డ్రైనింగ్ ప్రక్రియలో భాగంగా వచ్చే నీరేనని, టెక్నికల్ లోపం కాదని.. ఐఏఎఫ్ ఖండించింది. ఇది జరిగిన మరుసటి రోజే.. ప్రమాదం జరగడం మరింత అనుమానాలను పెంచింది. కానీ.. ప్రమాదంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిగి.. బ్లాక్ బాక్స్ విశ్లేషణ జరిగే దాకా.. కచ్చితమైన కారణం ఏమిటన్నది తెలిసే అవకాశం లేదు.

భారతీయ రక్షణ పరిశ్రమకు ప్రతిష్ఠాత్మక తేజస్ ఫైటర్ జెట్

ఏదేమైనా.. తేజస్ ఫైటర్ జెట్.. భారతీయ రక్షణ పరిశ్రమకు ప్రతిష్ఠాత్మకమైనది. మేకిన్ ఇండియా ప్రోగ్రాంలో ఎంతో కీలకమైనది. అలాంటి విమానం కూలిపోవడం అనేది.. పెద్ద చర్చకే దారితీసింది. కానీ.. దీని గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తేజస్ ప్రాజెక్ట్ 2001లో తొలిసారి గాల్లోకి ఎగిరినప్పటి నుంచి.. భారత వాయుసేనలో చేరిన తర్వాత కూడా దీనికి.. మంచి సేఫ్టీ రికార్డే ఉంది. గడిచిన 24 ఏళ్లలో.. నమోదైన రెండో ప్రమాదం మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశ ఎయిర్‌ఫోర్స్‌లోనైనా, ట్రైనింగ్, ఏరియల్ డిస్‌ప్లేల సమయంలో.. ఆధునిక యుద్ధ విమానాలు కూలిపోవడం అనేది సాధారణ విషయమే. ఎందుకంటే.. మిగ్-21, సుఖోయ్ లాంటి ఓల్డ్ జనరేషన్ జెట్స్‌తో పోలిస్తే.. తేజస్ సేఫ్టీ రికార్డ్ ఎంతో మెరుగ్గా ఉంది. అయితే.. ఇంటర్నేషనల్ ఎయిర్ షోలో, విదేశీ కొనుగోలుదారుల సమక్షంలో ప్రమాదం జరగడమనేది.. తేజస్ ఎగుమతి అవకాశాలపై తాత్కాలికంగా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రమాదానికి గల సరైన కారణాన్ని గుర్తించి.. భవిష్యత్తులో మరోసారి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఫైటర్ జెట్‌లో లోపమా?

ఇప్పుడు మ్యాటర్ మన తేజస్ ఫైటర్ జెట్ కూలడం గురించి కాదు. అదసలు..



పెద్ద విషయమే కాదు. ఎందుకంటే.. ఫైటర్ జెట్స్ కూలడం ఇదేం కొత్త కాదు. రఫేల్ కూడా ఎన్నోసార్లు కూలింది. ఎఫ్-16లు ఇప్పటిదాకా ఎన్ని కూలాయో లెక్కే లేదు. వాటితో పోలిస్తే.. తేజస్ చిన్నదే. ఏదేమైనా.. బగ్ ఈజ్ బగ్! అందులో లోపం ఎలాంటిదైనా.. దాన్ని సరిచేయాలి. ఎందుకంటే.. మిగ్-21 యుద్ధ విమానాల స్థానాన్ని భర్తీ చేసేందుకు తెచ్చిన తేజస్.. మరోసారి ఫెయిలవకుండా చూడాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. తేజస్ మళ్లీ కూలొద్దంటే.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో తేజస్‌కి సూపర్ సేఫ్టీ రికార్డ్

2024 మార్చిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో తేజస్ ఫైటర్ జెట్ కూలిపోయింది. 2001లో టెస్ట్ చేసిన తర్వాత.. 23 ఏళ్లకు రాజస్థాన్‌లో తొలిసారి ప్రమాదానికి గురైంది. ఆ ప్రమాదంలో.. పైలట్ సేఫ్‌గా బయటపడ్డాడు. మళ్లీ ఇప్పుడు.. దుబాయ్ ఎయిర్ షోలో తేజస్ క్రాష్ అయింది. 24 ఏళ్లలో.. కేవలం రెండుసార్లు మాత్రమే తేజస్ కుప్పకూలింది. దీనికి.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో మంచి సేఫ్టీ రికార్డ్ ఉంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేసిన ఈ %బాజూ% తేజస్.. తమిళనాడులోని సూలూరు స్క్వాడ్రన్‌కు చెందినది. 2016 నుంచి సర్వీసులో ఉంది. ఇటీవల కాలంలో మిగ్-21 విమానాలను తొలగించిన తరువాత తేజస్‌ను.. ఎయిర్‌ఫోర్స్ తమ తదుపరి ప్రధాన యుద్ధ విమానంగా భావిస్తోంది. తేజస్ విమానాన్ని వేగంగా దిశను మార్చుకునేలా.. డిజైన్ చేశారు. అందువల్ల.. దాని రూపకల్పన స్వతహాగా అస్థిరంగా ఉంటుంది. దీని కారణంగానే.. తీవ్రమైన నెగెటివ్ %+% లాంటి విన్యాసాల సమయంలో నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంది. దాన్ని కంట్రోల్ చేయడానికి.. అత్యాధునిక ఫ్లై-బై-వైర్ వ్యవస్థను దీంట్లో అమర్చారు.

తేజస్ మళ్లీ కూలొద్దంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?

ఐఏఎఫ్ ప్రస్తుతం.. తేజస్-ఎంకే1 లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ని ఉపయోగిస్తోంది. భవిష్యత్తులో రాబోయే.. మరింత అడ్వాన్స్‌డ్ తేజస్-ఎంకే1ఏ వెర్షన్ కోసం వెయిట్ చేస్తోంది. ఈ ప్రమాదం.. భవిష్యత్తులో రాబోయే జెట్‌ల తయారీలో భద్రతా ప్రమాణాలు మరింత కట్టుదిట్టంగా ఉండేలా దృష్టిసారించేందుకు వీలు కల్పిస్తుంది. వాయుసేన దర్యాప్తులో.. ప్రమాదానికి గల అసలు కారణాలేంటో తేలాక.. లోపాలను సరిదిద్ది.. ఈ మేడిన్ ఇండియా ఫైటర్ జెట్‌పై.. మళ్లీ నమ్మకాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. తేజస్ ఫైటర్ జెట్ కూలిపోవడం అనేది పెద్ద సమస్య కాకపోయినా, దాని విశ్వసనీయతను, భద్రతను మెరుగుపరచడం అత్యవసరం. మిగ్-21 స్థానాన్ని భర్తీ చేసిన స్వదేశీ యుద్ధ విమానం కావడంతో.. దీనిపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రపంచంలో ఏ ఫైటర్ జెట్‌కైనా ప్రమాదాలు సహజమే అయినప్పటికీ.. భవిష్యత్తులో తేజస్ మరోసారి ఫెయిల్యూర్ కాకుండా ఉండాలంటే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కీలకమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. ఇందుకోసం.. టెక్నికల్ ఇన్వెస్టిగేషన్, సిస్టమ్ ఇంప్రూవ్‌మెంట్ తక్షణమే చేపట్టాలి. ఇది మానవ తప్పిదం వల్ల జరిగిందా? డిజైన్ లోపాల వల్ల జరిగిందా? మెటీరియల్ ఫెయిల్యూరా? టెక్నికల్ లోపమా? అనే అంశాలపై దృష్టి పెట్టాలి. విమానంలో తరచుగా కనిపిస్తున్న సాంకేతిక లోపాలేమైనా ఉన్నాయా? అనే దానిపై లోతుగా రీసెర్చ్ చేయాలి.

సాంకేతిక లోపాలతో పాటు, పైలట్ శిక్షణ , ఆపరేటింగ్‌లకు ప్రత్యేక శిక్షణ

సాంకేతిక లోపాలతో పాటు, పైలట్ శిక్షణ, ఆపరేటింగ్ విధానంలోనూ మెరుగుదల కావాలి. ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కొనేందుకు.. పైలట్లకు అడ్వాన్స్‌డ్ ఫ్లైట్ సిమ్యులేటర్లలో.. అత్యంత కఠినమైన ట్రైనింగ్ ఇవ్వాలి. అత్యవసర పరిస్థితుల్లో జెట్‌ని ఎలా విడిచిపెట్టాలి అనే దానిపైనా ప్రత్యేక శిక్షణ ఉండాలి. కాక్‌పిట్ డిజైన్, డిస్‌ప్లేలు పైలట్‌కు ఒత్తిడి సమయంలోనూ స్పష్టంగా, సులభంగా అర్థమయ్యేలా ఉన్నాయో లేదో రివ్యూ చేయాలి. భవిష్యత్‌లో రాబోయే తేజస్ మార్క్-1ఏ, మార్క్-2 వెర్షన్లలో ఈ లోపాలు రిపీట్ కాకుండా చూడాలి. విమానం బిల్డ్ క్వాలిటీ, ముఖ్యంగా ఒత్తిడి ఎక్కువగా ఉండే భాగాల్లో మరింత పటిష్టత ఉండేలా చూడాలి. మెరుగైన కాంపోజిట్ మెటీరియల్స్‌ను ఉపయోగించాలి. ఇంజిన్, ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్, హైడ్రాలిక్ సిస్టమ్ లాంటి క్లిష్టమైన భాగాల్లో.. ఒక సిస్టమ్ ఫెయిలైతే.. రెండో సిస్టమ్ వెంటనే పనిచేసేలా ఉండేలా.. డిజైన్‌ని మెరుగుపర్చాలి. ఫెయిలయ్యే అవకాశం ఉన్న భాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం కంటే.. దేశీయంగా మెరుగైన నాణ్యతతో అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలి.

భారతీదేశ సాంకేతిక శక్తికి ప్రతీకగా తేజస్

తేజస్ అనేది.. కేవలం ఓ ఫైటర్ జెట్ కాదు. ఇది భారతదేశ సాంకేతిక శక్తికి ప్రతీక. ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన ఎఫ్-16, రఫేల్ లాంటి జెట్‌లు

# ‘గ్రేటర్ అమరావతి’.. కేంద్రం గ్రీన్ సిగ్నల్!



అమరావతి,అమరావతి విషయంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా గత అనుభవాల దృష్ట్యా అమరావతికి చట్టబద్ధత కల్పించాలన్నది ప్రధాన డిమాండ్. అయితే ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలో పార్లమెంట్ ముంగిటకు అమరావతి బిల్లు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సైతం కోరినట్లు సమాచారం. తాజాగా సిఆర్డిఏ అధికారులకు అమరావతి రైతులు కోరింది ఇదే. ఒకసారి చట్టబద్ధత కల్పిస్తే అమరావతి రాజధానిని కదిలించలేరన్నది రైతుల వాదన. దానిని గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది రాష్ట్ర ప్రభుత్వం. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వచ్చే నెలలో అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ముంగిటకు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

నవ నగరాలే టార్గెట్

అమరావతిలో నవ నగరాలు నిర్మించాలన్నది చంద్రబాబు ప్రణాళిక. ప్రస్తుతం అమరావతిలో 29 పంచాయితీలే ఉన్నాయి. అయితే ఇటు విజయవాడ, అటు గుంటూరును కలుపుకొని అమరావతిని ఏకైక నగరంగా గుర్తిస్తే.. గ్రేటర్ హైదరాబాద్ గా మారుతుంది అన్నది చంద్రబాబు ఆలోచన. మొన్న ఈ మధ్యన అదే ప్రకటన చేశారు చంద్రబాబు. 29 పంచాయతీలను అమరావతిగా గుర్తించడం అనేది భావ్యం కాదని.. అమరావతి అనేది ఒక సువిశాల నగరంగా ప్రపంచానికి పరిచయం చేయాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అయితే ఇప్పుడు చట్టబద్ధత కల్పించే విషయంలో ఎలా ముందడుగు వేయాలి అన్నది బాబు ముందున్న అంశం. అయితే వచ్చే ఏడాది వరకు నగరపాలక సంస్థలతో పాటు మున్సిపాలిటీలకు పదవీకాలం గడువు ఉంది. అయితే అంతకంటే ముందే ఈ నగరాలను, పట్టణాలను, పంచాయితీలను అమరావతి కిందకు తెచ్చేందుకు చంద్రబాబు సర్కార్ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

జిహెచ్ఎంసి తరహాలో..

గ్రేటర్ హైదరాబాద్ తరహాలో.. గ్రేటర్ అమరావతిని తెస్తే బాగుంటుందన్న అభిప్రాయం అధికార వర్గాల్లో ఉంది. ఎందుకంటే అటు విజయవాడ, ఇటు గుంటూరు మధ్య అమరావతిని అభివృద్ధి చేయాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అమరావతికి ఆ రెండు నగరాలు తోడైతే ప్రపంచంలోనే ఏకైక నగరంగా నిలపవచ్చు అన్నది కూడా ఆయన ఆలోచన. అందుకే ఈ మూడు నగరాలను కలిపి ఏకైక నగరంగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే ఎంతో బాగుంటుందని అధికారులు సైతం కీలక సూచనలు చేశారట. అయితే ఇప్పటికే కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు కోరిందట. మొత్తానికి అయితే అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు అవసరమైన అడుగులు పడుతుండడం నిజంగా శుభ పరిణామం.

# అప్పటి వరకు సైలెంట్ మోడ్ లోనే!

హైదరాబాద్,బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల్లోకి ఎప్పుడు వస్తారనే దానిపై జోరుగా చర్చ జరుగుతోంది. మొన్న జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలోనూ ఆయన ప్రచారానికి వస్తారని ఊహాగానాలు వినిపించినా అలాంటిదేమి జరగలేదు. ఈ నేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం అధినేత ప్రజాక్షేత్రంలోకి వస్తారా లేదా అనేది ఉత్కంఠ రేపుతోంది. ఇటువంటి తరుణంలో సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ ఒకటి ఆసక్తిగా మారింది.

అప్పటి వరకు నో:

ప్రజాక్షేత్రానికి దూరంగా ఉన్నప్పటికీ పార్టీ నాయకులకు కేసీఆర్ ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై అనుసరించాల్సిన వ్యూహాలను కేటీఆర్, హరీశ్ రావులకు సలహాలు ఇస్తున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే కేసీఆర్ ప్రత్యక్షంగా లేని లోటును పార్టీ శ్రేణులు ఎదుర్కొంటున్నాయని దాంతో ఆయన ఒక్కసారైనా ప్రజల్లోకి రావాలనే అభిప్రాయాలు సొంతపార్టీలోనే వ్యక్తం అవుతున్నాయి. కానీ కేసీఆర్ మాత్రం వచ్చే ఏడాది కూడా ప్రజల్లోకి వచ్చే అవకాశం లేదని సోషల్ మీడియాలో ప్రచారం గుప్పుమంటోంది. 2027 ఏప్రిల్ తర్వాతే ఆయన ప్రజల్లోకి రాబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక అదే సమయంలో కేటీఆర్ సైతం పాదయాత్ర నిర్వహిస్తారని రాష్ట్ర రాజకీయాల్లో ఈ టైమ్ ఫ్రేమ్ పాదయాత్రలకు అత్యంత అనుకూలం అని అని అందువల్లే బీఆర్ఎస్ నాయకత్వం ఈ రకంగా సెట్ చేస్తోందనే టాక్ వినిపిస్తోంది. పార్టీ పునర్నిర్మాణం, పునర్ వ్యవస్థీకరణ అంతా 2027 ఏప్రిల్ కంటే ఆరు నెలల ముందు 2026 చివర్లోనే మొదలవుతాయనే టాక్ వినిపిస్తోంది. రాష్ట్ర అసెంబ్లీకి షెడ్యూల్ ప్రకారం 2028లో ఎన్నికలు జరగాల్సి ఉంది. దీంతో 2026 అక్టోబర్ నుంచి బీఆర్ఎస్ తన ఎన్నికల ప్రిపరేషన్స్ ను స్పీడప్ చేసి 2027లో పూర్తిస్థాయిలో ప్రజల సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై కార్యక్రమాలు నిర్వహించుకునేలా కేసీఆర్ ప్రక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారనే చర్చ సోషల్ మీడియాలో వినిపిస్తోంది.

డ్యామేజ్ ఎవరికి అడ్వాంటేజ్ ఎవరికి:

కేసీఆర్ ప్రజాక్షేత్రానికి దూరంగా ఉండటం కాంగ్రెస్ పార్టీకి అదనపు అడ్వంటేజ్ అనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అధికారం ఉంటేనే కేసీఆర్ ప్రజల గురించి ఆలోచిస్తారని లేదంటే ప్రజల సమస్యలను కూడా పట్టించుకోరనే నెరెటివ్ ను ఇప్పటికే అధికార కాంగ్రెస్ క్రియేట్ చేస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు జోష్ లో ఉన్న హస్తం పార్టీ అదే ఊపుతో స్థానిక సంస్థల ఎన్నికలకు సై అంటోంది. ఈ ఎలక్షన్స్ లో సత్తా చాటితే ఇక రాష్ట్ర రాజకీయాల్లో తమకు తిరిగుండదనేది రేవంత్ రెడ్డి అంచనాతో ఉన్నారనే టాక్ వినిపిస్తోంది. దీంతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ప్రకారం మరో ఏడాది కాలం కేసీఆర్ పూర్తిగా ప్రజా క్షేత్రానికి దూరంగా ఉంటే అది గులాబీ పార్టీకి ఏ రకంగా డ్యామేజ్ చేస్తుంది కాంగ్రెస్ పార్టీకి ఏ మేరకు అడ్వాంటేజ్ గా మారుతుంది అనేది కాలమే సమాధానం చెప్పనుంది.

# మాదాపూర్‌లో గంజాయి, మాదకద్రవ్యాల పట్టివేత

హైదరాబాద్, మాదాపూర్ జోన్ పరిధిలో ఎస్ఓటీ పోలీసులు భారీ ఎత్తున డ్రగ్స్‌ను పట్టివేశారు. సోమవారం మొదట మాదాపూర్ లో 41కిలోల గంజాయి, 15గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్, 1.170గ్రాముల అల్ప్రజోలంనుమాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. మూడు చోట్ల డ్రగ్స్ రాకెట్ ను బస్ట్ చేశారు పోలీసులు. ఈ సందర్భంగా మొదటి కేసుకు సంబంధించి డ్రగ్స్ పట్టివేతకు సంబంధించిన వివరాలను వెల్లడించిన మాదాపూర్ జోన్ డీసీపీ రీతిరాజ్.. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పది లక్షల రూపాయల విలువ చేసే 1.170 గ్రాముల అల్ప్రజోలం పట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో గౌండ్ల బాల మురళి కృష్ణ(38) అనే వ్యక్తి చుట్టు పక్కల దుకాణాల్లో సప్లై చేస్తున్నట్లు గుర్తించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ పట్టుకున్నట్లు తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల కోసం బెంగుళూరు నుండి తెచ్చినట్లు గుర్తించారు. హరీష్, సాయి కృష్ణ, సాయి మణికంఠ అనే ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి నుంచి ఒక లక్ష 50 వేల విలువ చేసే 15 గ్రాముల ఎండిఎంఏ స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. మూడో కేసులో కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 41కిలోల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు డీసీపీ రీతిరాజ్. వెస్ట్ బెంగాల్ నుంచి తెచ్చిన గంజాయిని.. హైదరాబాద్ లో బీహార్ కూలీలకు అమ్ముతున్నారని తెలిపారు. వెస్ట్ బెంగాల్ నుండి సికింద్రాబాద్ వరకు ట్రైన్ లో తెచ్చి అమ్ముతున్నారని చెప్పారు. ఈ కేసులో మిథున్ బర్మాన్, సడెన్ రాయ్, రీజల్గ్ ÷క్ లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారినుంచి 21లక్షల రూపాయల విలువ చేసే 41.9కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి..!

న్యూఢిల్లీ, రష్యా నుంచి చమురు కొనుగోలుకు నిరసనగా విధించిన అదనపు సుంకాలను తొలగించాలంటూ అమెరికాపై ఒత్తిడి తీసుకురావాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ పేర్కొంది. ఈ సుంకాలను ఎత్తివేస్తే భారతీయ వస్తువులపై అమెరికా విధించిన సుంకాల భారం 50శాతం నుంచి 25శాతానికి తగ్గనున్నది. ఇది వస్త్రాలు, తోలు, రత్నాలు, ఆభరణాలు, ఫార్మా వంటి రంగాలకు గణనీయమైన ఉపశమనం కలిగించనున్నది. ఆయారంగాలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నాయి. ప్రభుత్వంతో జరగనున్న సమావేశంలో రెండు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని జీటీఆర్ఐ వాణిజ్య బోర్డు ని కోరింది. మంగళవారం ప్రభుత్వంతో జరిగే బీవోటీ సమావేశానికి వాణిజ్యం, పరిశ్రమల మంత్రి అధ్యక్షత వహించనున్నారు. ఎగుమతి వృద్ధిని పెంచే చర్యలను సమావేశంలో సిఫారసు చేయనున్నారు.భారతదేశ ఎగుమతి పోటీతత్వాన్ని పునరుద్ధరించడం, యూఎస్‌తో భవిష్యత్తులో జరిగే చర్చల్లో భారతదేశాన్ని సమాన స్థాయిలో ఉంచేందుకు సుంకాల తగ్గింపు అవసరమని నివేదిక పేర్కొంది. భారతదేశం మంజూరు చేయబడిన రష్యన్ కంపెనీల నుంచి చమురు కొనుగోలును ఎక్కువగా నిలిపివేసిందని అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా అంగీకరించారని జీటీఆర్ఐ గుర్తు చేసింది. దాని ఆధారంగా సర్‌ఛార్జ్ విధించబడింది. ఎగుమతి ప్రమోషన్ మిషన్ ప్రస్తుతం ఒక ఫ్రేమ్‌వర్క్‌కే పరిమితం అని జీటీఆర్ఐ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించబడింది. నవంబర్ 12న కేబినెట్ ఆమోదించింది. ఈ మిషన్‌కు 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఎనిమిది నెలల వరకు ఇంకా కార్యాచరణ ప్రణాళిక లేదని, ఎగుమతి వృద్ధిని వేగవంతం చేయడానికి ఈ ప్రణాళికలను వెంటనే అమలు చేయడం చాలా అవసరమని నివేదిక పేర్కొంది.

## ఆర్థికంగా బలోపేతమే లక్ష్యం

జగిత్యాల,మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని మహిళా సంఘ సభ్యులకు రూ.2కోట్ల 19 లక్షల 95 వేల 800 వడ్డీ లేని రుణాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో

# ఢాకాకు హసీనా అప్పగింత..భారత నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి



ఢాకా, తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌ను తమకు అప్పగించాలని కోరుతు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు లేఖ పంపింది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది సర్వత్రా ఆసక్తిగా మారింది. ప్రపంచదేశాలు కూడా దీనిపై ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ విదేశాంగ శాఖ సలహాదారు తౌహిద్ హుస్సేన్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న సంగతి తెలిసిందే. హసీనా పదవీకాలంలో అనేక మంది రాజకీయ కార్యకర్తలు, విమర్శకులు అదృశ్యమయ్యారనే కేసులో బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసిటి) ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు అమలులో భాగంగా భారత్‌కు బంగ్లాదేశ్ ఈ లేఖ పంపినట్లు హుస్సేన్ తెలిపారు. తీర్పు వివరాలు ఉన్న లేఖను కూడా భారత్‌కు పంపినట్లు ఆయన వెల్లడించారు. అసదుజ్జమాన్‌ను కూడా మరణ శిక్ష విధించినయ విషయాన్ని కూడా భారత్‌కు తెలిపామన్నారు.. 'ఈ ఇద్దర్నీ ఆలస్యం చేయకుండా బంగ్లాదేశ్ అధికారులకు అప్పగించాలని మేము భారత ప్రభుత్వాన్ని కోరుతున్నా ము. ఇరుదేశాల మధ్య ఉన్న అప్పగింతల ఒప్పందం ప్రకారం ఇది భారతదేశంపై కూడా ఒక బాధ్యత' అని లేఖలో బంగ్లాదేశ్ పేర్కొంది. అయితే ఈ లేఖపై న్యూఢిల్లీలోని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించాల్సి ఉంది. కాగా ఐటిసి తీర్పును 'గమనించాము' అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గతంలో వ్యాఖ్యానించింది.

# లోకల్‌లో హిట్ కొట్టేందుకు.. కాంగ్రెస్ నయా స్కెచ్

హైదరాబాద్,జూబ్లీహిల్స్‌లో 25 వేల ఓట్లతో బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు గ్రామాల్లో హస్తం రంగు వేయాలని స్కెచ్ లు వేస్తోంది. 90 శాతం సీట్లు.. మెజారిటీ సర్పంచ్‌లు.. టార్గెట్ గా రేవంత్ ఆర్మీ ఇప్పటికే గ్రౌండ్‌లో దిగిపోయిందట. ఆరు గ్యారెంటీలు, ఇందిరమ్మ ఇళ్లు ప్రచారాస్త్రాలుగా మలిచి గ్రామాల్లో ప్రచార దండయాత్రకు సిద్ధమైందట. ఇంతకీ కాంగ్రెస్ మార్క్ స్ట్రాటజీ ఎలా ఉండబోతోంది. పక్కా వ్యూహంతోనే మొదటగా పంచాయతీ ఎన్నికలు

90శాతం సీట్లు టార్గెట్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలుపు కాంగ్రెస్ పార్టీకి మరింత జోష్ తీసుకువచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా 90శాతం సీట్లు సాధించి మార్క్ చూపించేందుకు సిద్ధమవుతున్నది. అందులో భాగంగా మొదట పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని పక్కా ప్లాన్ చేస్తున్నదట. ఇప్పటికే గ్రౌండ్ వర్క్ కూడా ప్రిపేర్ చేసుకుందని టాక్. స్థానిక ఎన్నికల అనంతరం జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నది. ఎవరెం చేసినా, ఎన్ని ప్లాన్స్ చేసినా.. .స్థానిక ఎన్నికల్లో సైతం జూబ్లీహిల్స్ బై పోల్ వచ్చిన రికార్డులే వస్తాయనిధీమా వ్యక్తం చేస్తున్నదట. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నదట హస్తం పార్టీ.

రెండేళ్ల ప్రగతి వివరణ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతుండటంతో ఈ రెండేళ్లలో సాధించిన ప్రగతిని వివరించేందుకు సిద్ధమవుతుంది. డిసెంబర్ 1 నుంచి 9వరకు ప్రభుత్వం.. ప్రజాపాలన దినోత్సవాలను నిర్వహించబోతున్నది. ఈ వారోత్సవాల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరు గ్యారంటీలు.. ఇప్పటికే అమలు చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమా లు, పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని భావిస్తున్నది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రజా ప్రతినిధులకు సూచనలు చేసినట్లు సమాచారం.

రుణ మాఫీ, మహిళలకు రుణాలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, మహిళలకోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించబోతున్నట్లు సమాచారం. రుణ మాఫీ, మహిళలకు రుణాలు, సబ్సిడీపై గ్యాస్, ఉచిత కరెంటు, ఉద్యోగాల కల్పన అంశాలను విస్తృతంగా ఇంటింటికి వివరించేందుకు సిద్ధమవుతుందట. అంతేగాకుండా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సైతం ప్రధాన అస్త్రంగా చేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తుందట. ఇప్పటికే మహిళా సంఘాల్లోని సభ్యులకు ఉచితంగా చీరల పంపిణీ చేపడుతుంది. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలోని నేతలను భాగస్వాములను చేస్తూ ప్రచార స్పీడ్ పెంచింది. ఇంటింటికి వెళ్లి పంపిణీ చేపట్టాలని



ఇప్పటికే ఆదేశాలు సైతం జారీచేసింది. దీనికి తోడు ప్రభుత్వ పథ కాలతో పాటు చేస్తున్న సంక్షేమం, ఈ చీరల పంపిణీ కార్యక్రమానికి చెందిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో సైతం వాట్సాప్ గ్రూపుల్లోనూ ప్రచారం చేయాలని సోషల్ మీడియాకు సూచనలు చేసిందట.

ప్రభుత్వంపై విమర్శలకు గట్టి కౌంటర్లు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను మరోసారి ప్రజలకు వివరించాలని పార్టీ నేతలకు సూచించిందట. అంతే గాకుండా ప్రభుత్వంపై విమర్శలకు గట్టి కౌంటర్లు ఇవ్వాలని ఇదే స్థానిక సంస్థల ఎన్నికల్లో అస్త్రంగా పనిచేస్తుందని చెప్పినట్టు సమాచారం. ప్రజల్లో బీఆర్ఎస్ వైఫల్యాలను ఎప్పటికప్పుడు మననం చేస్తుండాలని ఆదేశించినట్లు తెలిసింది. ఏది ఏమైనా కాంగ్రెస్ మెజార్టీ సర్పంచ్ స్థానాలను సాధించడ మే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. ఇప్పటి నుంచే పార్టీ అధిష్టానం సైతం ఆదేశాలు ఇస్తూ నేతలను అలర్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

80శాతం గ్రామాల్లో విజయఢంకా

గ్రామాల్లో పట్టుకోసం కాంగ్రెస్ పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తుంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తుంది. అందులో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి స్కెచ్ వేశారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు మెజార్టీ సీట్లు సాధించే లక్ష్యం పెట్టుకుంది. 80శాతం గ్రామాల్లో అధికారపార్టీ విజయఢంకా మోగించేందుకు సిద్ధమైంది. అందుకే తొలుత గ్రామసర్పంచ్ లు, వార్డులకు ఎన్నికలకు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మంగళవారం జరిగే కేబినెట్ లో తేదీలు ఫైనలైజ్ అవుతాయని తెలుస్తోంది. ఏది ఏమైన కాంగ్రెస్ మెజార్టీ సర్పంచ్ స్థానాలను సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. ఇప్పటి నుంచే పార్టీ అధిష్టానం సైతం ఆదేశాలు ఇస్తూ నేతలను అలర్టు చేస్తున్నది.

# రిజర్వేషన్లలో బిసిలకు న్యాయం దక్కేనా




హైదరాబాద్,పంచాయితీ ఎన్నికలుకు సంబంధించి బిసి రిజర్వేషన్ల కేటాయింపులో గందరగోళం నెలకొన్నదని పలు బిసి సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీ కోటా గతం కంటే తగ్గిపోయింది. అన్ని జిల్లాల వివరాలను సేకరించి త్వరలోనే సీఎస్‌ను కలిసి ఫిర్యాదుచేస్తాం అని అంటున్నారు. న్యాయం చేయకుంటే కోర్టుల ద్వారా పోరాటం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలోని బీసీ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ అన్యాయంపై తక్షణం స్పందించాలని వారు కోరుతున్నారు. కోటా తగ్గింపునకు వ్యతిరేకంగా 30న చలో హైదరాబాద్ నిర్వహిస్తాం అని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. చాలా జిల్లాల్లో గతంలో కంటే బీసీ కోటా తగ్గిపోయినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయన్నారు. 42 శాతం రిజర్వేషన్లు దేవుడెరుగు కనీసం ఇప్పటికే ఉన్న బీసీ రిజర్వేషన్లకే రాష్ట్ర ప్రభుత్వం గండి కొడుతున్నదని మండిపడ్డారు. వాస్తవంగా 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 18శాతం నుంచి 22.79 వరకు రిజర్వ్ అయ్యాయి.కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో అనేక కొత్త పంచాయతీలు ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం బీసీలకు 16 నుంచి 20 శాతానికి మించి రిజర్వేషన్లు దక్కడంలేదని వివరిస్తున్నారు. అనేక డివిజన్లు, మండలాల్లో బీసీలకు ఒకటి కూడా సర్పంచ్ సీటు రిజర్వు కాలేదని, గత ఎన్నికల్లో కంటే కనీసం రెండు మూడు స్థానాల వరకు బీసీ కోటాను తగ్గించారని ఆందోళన వ్యక్తం చేసారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారు చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేస్తూ జీవో-46 విడుదల చేసింది. సర్పంచ్ స్థానాలకు 2011 జనాభా లెక్కలను, వార్డు మెంబర్ స్థానాలకు 2024 ఇంటింటి సర్వే లెక్కలను పరిగణన లోకి తీసుకోవాలని స్పష్టంచేసింది. అయితే, రాష్ట్రాలు నిర్వహించిన కులగణన సర్వేలకు చట్టబద్ధత లేదని, పారదర్శకత ఉండబోదని, ఆ సర్వే గణాంకాలు చెల్లబోవని కేంద్రం ఇప్పటికే అనేకసార్లు స్పష్టంచేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇంటింటి సర్వే గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవాలని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. జనాభాగణన అంశం 7వ షెడ్యూల్‌లో కేంద్ర జాబితాలోని అంశం. గణాంకాల సేకరణ చట్టం-2008 ప్రకారం సర్వే నిర్వహించాలన్నా కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉన్నది. స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు గణాంకాల సేకరణకు ఒక ప్రభుత్వ శాఖను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా నియమించాలి. నేషనల్ ప్లానింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ డిపార్ట్‌మెంట్, స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్‌వో తదితర విభాగాల నుంచి రాష్ట్రానికి చెందిన తాజా ఇండ్ల జాబితాను, బ్లాక్‌వారీ గా రూపొందించిన హౌసింగ్ మ్యాపులను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలకు సంబంధించిన స్థితిగతులను తులనాత్మక అధ్యయనం చేయాల్సి ఉంటుంది. తుదకు అన్నింటినీ క్రోడీకరించి, విశ్లేషించి తుదకు కేంద్రం ఆమోదంతో ఆ గణాంకాలను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకునే అవకాశముంటుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.160 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో 2024 నవంబర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో మొత్తంగా 3.7 కోట్ల మంది జనాభా ఉండగా, అందులో 96.9శాతం మందిని సర్వే చేసి వివరాలను సేకరించిందని అంటున్నారు. ఆ లెక్కనే 100 శాతం కరెక్టని కాంగ్రెస్ చెప్పుకుం టోందని అంటున్నారు. అయితే స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాల గణాంకాలనే బయటపెట్టింది. కులాలు, ఉపకులాల వారీగా వివరాలను మాత్రం గోప్యంగా దాచిపెట్టింది. పూర్తిస్థాయి నివేదికను వెల్లడించకపోవడం, అభ్యంతరాలను స్వీకరించకపోవడంతో సర్వే గణాంకాలకు సాధికారత లేకుండా పోయిందని పలు బిసి నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ, తాజాగా ఆ గణాంకాలనే ప్రామాణికంగా తీసుకుని స్థానిక రిజర్వేషన్లు ఖరారు చేయాలని మార్గదర్శకాలు జారీచేయడంపై చర్చ కొనసాగుతున్నది. కులగణన అంశం పూర్తిగా కేంద్రం పరిధిలోనిదేనని కేంద్రం గతంలోనే స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా గణనలో కులగణనను కూడా నిర్వహించా లని ఆ కమిటీ నిర్ణయించింది. అందుకు సంబంధించి షెడ్యూల్ ను కూడా ఇప్పటికే ప్రకటించింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2024 ఇంటింటి సర్వే గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవడం ఇప్పుడు అనేక వివాదాలకు తావిస్తున్నది. ఈ క్రమంలో యా స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల రొటేషన్ పక్రియను సైతం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారనే ఆరోపణలొస్తున్నాయి. 2019కి ముందు ఏర్పడిన పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు మాత్రమే రొటేషన్ వర్తిస్తుంది. 2019 తరువాత ఏర్పడిన నూతన పంచాయితీలు, మండలాలు, జిల్లాలకు రొటేషన్ వర్తించదు. మొదటినుంచి రోస్టర్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. రొటేషన్ ఎలా చేయాలంటే తొలుత ఎస్టీ జనరల్, మహిళలు, ఎస్సీ జనరల్, ఎస్సీ మహిళలు, బీసీ జనరల్, బీసీ మహిళలు, జనరల్ స్థానాలుగా మార్చాలి. ఈ రొటేషన్ క్రమాన్ని కూడా పాటించలేదని తెలుస్తున్నది. అంతేకాకుండా, కొన్ని స్థానాలకు 2011 జనాభాల లెక్కలను, మరికొన్ని స్థానాలకు 2024 ఇంటింటి సర్వే జనాభా లెక్కలను

# ఇండియా గేమ్ చేంజర్.. ఇక మన యుద్ధవిమానాల్లో సొంత ఇంజిన్.. ప్రపంచ దేశాలకు షాక్

న్యూఢిల్లీ, భారత ఆర్మీలో.. వాయుసేన కీలకపాత్ర పోషిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన వాయుసేన ఉగ్రస్థావరాలతోపాటు పాకిస్తాన్‌లోని ఎయిర్ బేస్‌లను తుత్తుతుత్తు చేసింది. ఇప్పటికీ పాకిస్తాన్ ప్యాచ్ వర్క్‌లు చేసుకుంటోంది. ఇంతటి కీలకమైన వాయుసేనకు చెందిన తేజస్ యుద్ధ విమానం.. ఇటీవల దుబాయ్‌లో కూలిపోయింది. ఎయిర్‌షో సందర్భంగా ఒక్కసారిగా అదుపు తప్పి కూలిపోయింది. మన వింగ్ కమాండర్ దుర్మరణం చెందారు. దీంతో తేజస్ యుద్ధ విమానాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది.

విదేశీ ఇంజిన్లే..

భారత్ చాలా వరకు విదేశీ యుద్ధ విమానాలే కొనుగోలు చేసింది. మొన్నటి రఫేల్ కూడా ఫ్రాన్స్‌కు చెందినది. అయితే ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ సొంతంగా ఆయుధాల తయారీపై దృష్టిపెట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఆయుధాలు తయారు చేస్తోంది. డీఆర్డీవో, హెచ్ఏఎల్ ఆయుధాల తయారీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే తేజస్ కూడా మనం తయారు చేసుకున్నదే. అయితే ఇందులో ఉన్న ఇంజిన్ మాత్రం విదేశీయులది. మన తయారు చేస్తున్న విమానాల్లో వాడుతున్న ఇంజిన్లన్నీ వీదేశాల నుంచి తెచ్చినవే. మనం సొంత ఇంజిన్లు తయారు చేసుకోకుండా అమెరికా, రష్యా అడ్డుకుంటున్నాయి. ఎందుకంటే వారి వ్యాపారం దెబ్బతింటుంది.

డీఆర్డీవో అద్భుతం..

ఈ క్రమంలో మన డీఆర్‌డీవో అద్భుతం చేసింది. శాఫ్రాన్ పేరిట ఫిఫ్త్ జనరేషన్ స్వదేశీ ఇంజిన్ డిజైన్ పూర్తి చేసింది. ఇది విజయవంతం అయితే భారత రక్షణ



పరిశ్రమలో స్వయం ఆధారత ఎక్కువ అవుతుంది, విమాన యంత్రాలు కేవలం దిగుమతులపై ఆధారపడకుండా తయారీ విస్తరణ జరుగుతుంది. తేజస్ ప్రాజెక్టుకు సరిపోయే ఇంజిన్ ఎంపిక కీలకం. జీఈ ఎఫ్404, యూరోజెట్ ఈజే200 లాంటి ఆధునిక ఇంజిన్లు తేజస్‌కు సమర్థవంతంగా ఉండటంతో డీఆర్డీవో కవేరి ఇంజిన్‌లో తక్కువ శక్తి కారణంగా అవమానాలు ఎదురైంది. అందుకే శక్తివంతమైన ఇంజిన్ వికాసం దేశ రక్షణ సామర్థ్యాలను పెంచుతుంది. డీఆర్డీవో శాఫ్రాన్ ఇంజిన్‌ను పూర్తి చేసి పారదర్శకతలతో ఇంజిన్ తయారీలో విదేశాలపై ఆధారాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇది భారత అభివృద్ధిని ప్రపంచస్థాయిలో నిలబెట్టే కీలక దశగా భావిస్తున్నారు. ఈ విజయాలు భారత వేదికపై స్వదేశీ యుద్ధ విమాన పరిణామానికి కీలక పాత్ర పోషిస్తున్నాయి.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో పెను సంచలనం!



హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను మరోసారి ప్రపంచ స్థాయి చర్చల్లో నిలబెడుతూ కోకాపేట భూమి ధరలు కొత్త రికార్డు సృష్టించాయి. ప్రభుత్వ భూ వేలంలో ఒక్క ఏకరానికి భారీగా రూ.137 కోట్లు పలకడం పెట్టుబడిదారులను, రియల్ ఎస్టేట్ నిపుణులను ఆశ్చర్యానికి గురిచేసింది. అధికారులు మొదట్లో ఊహించిన బేస్ ధర కంటే రెట్టింపు ఉత్సాహం కనిపించడంతో ఈ వేలం నగర రియల్ ఎస్టేట్‌లో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

అవుట్‌స్కర్ట్స్ నుంచి ప్రీమియం జోన్‌గా కోకాపేట

కొన్నేళ్ల క్రితం వరకు నగర శివార్ల ప్రాంతంగా పరిగణించిన కోకాపేట, ప్రస్తుతం హైటెక్ సిటీ – ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ల విస్తరణ కారణంగా అత్యంత ప్రాధాన్య ప్రాంతంగా మారింది. భారీ కమర్షియల్ ప్రాజెక్టులు రాబోతుండటం... అంతర్జాతీయ స్థాయి రోడ్డు కనెక్టివిటీ (ఓఆర్ఆర్) అందుబాటులో ఉండటం... వేగంగా పెరుగుతున్న ఐటీ హబ్ సమీపంలో ఉండటం... ఈ కారణాల వల్ల ఈ ప్రాంతంపై జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టి గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం ఏకరానికి రూ.99 కోట్లుగా బేస్ ప్రైస్‌ను నిర్ణయించింది. అయితే వివిధ ప్రధాన రియల్ ఎస్టేట్ కంపెనీల మధ్య నెలకొన్న ఆరోగ్యకరమైన పోటీ కారణంగా చివరి బిడ్ నేరుగా రూ.137 కోట్ల వరకు చేరింది.

రాయదుర్గ్ తర్వాత కోకాపేట కొత్త హాట్‌స్పాట్

ఇప్పటివరకు ఏకరానికి అత్యధిక ధరను రాయదుర్గ్ రికార్డు చేసింది దాదాపు రూ.177 కోట్లు. అయితే అక్కడ భూమి లభ్యత తగ్గిపోవడంతో పెట్టుబడిదారులు ఇప్పుడు ప్రత్యామ్నాయంగా కోకాపేట వైపు దృష్టి మళ్లించారు. ఈ కొత్త రికార్డు, ప్రధాన ఐటీ కారిడార్ నుంచి పెట్టుబడుల డిమాండ్ ఎలా పరిసర ప్రాంతాలకు విస్తరించిందో స్పష్టంగా చూపిస్తోంది. కేవలం కొద్ది కిలోమీటర్ల దూరంలో ఉన్న కోకాపేట, రాయదుర్గ్‌కు సమానమైన మౌలిక సదుపాయాలు.. భవిష్యత్ వృద్ధి అవకాశాలను అందించడం ఈ డిమాండ్‌కు ప్రధాన కారణం.

భవిష్యత్ వృద్ధికి కోకాపేటే కేంద్రబిందువు

రియల్ ఎస్టేట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. కోకాపేటను తదుపరి ప్రీమియం ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా మార్చే అంశాలున్నాయి. రాబోయే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ వల్ల పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు.. గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి సాధ్యమవుతుంది.. నూతన టెక్ జోన్ల ఏర్పాటుకు.. ఐటీ పరిశ్రమ విస్తరణకు అవకాశాలు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చెంది విస్తృతంగా ఏర్పాటు కానున్న రోడ్లు , ఇతర మౌలిక సదుపాయాలు కల్పించబడుతాయి. ఓఆర్ఆర్ , నూతన రోడ్డు కనెక్టివిటీ: నగరంలోని ఇతర ప్రాంతాలకు వేగవంతమైన ప్రయాణం సులభంగా సాధ్యమవుతుంది.. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నగరం. దీంతో ప్రధాన ఐటీ హబ్ చుట్టుపక్కల ప్రాంతాలను కూడా పెట్టుబడిదారులు పెద్దగా పరిశీలిస్తున్నారు. కోకాపేటలో తాజా వేలం,హైదరాబాద్ రియల్ ఎస్టేట్ లో పెద్ద ఊపు వచ్చేసింది అన్న విషయాన్ని స్పష్టంగా రుజువు చేసింది.

# ఏడుగురు కాంగ్రెస్ నాయకులపై వేటు...

పాట్నా : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. ఈ ఫలితాల అనంతరం ఆ పార్టీ ఇప్పుడు ఆత్మవిమర్శ చేసుకుంటోంది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరించారనే కారణంతో ఏడుగురు సీనియర్ నాయకులపై వేటు వేసింది. ఆరేళ్లపాటు వారి ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా రద్దుచేసింది. పార్టీ క్రమశిక్షణ కమిటీ సమీక్ష చేసిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. వేటు పడిన వారిలో పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఆదిత్య పాశ్వాన్, మరో మాజీ ఉపాధ్యక్షుడు షకీల్ ఉర్ రెహమాన్, కిసాన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ శర్మ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్ కుమార్ రంజన్, మరో మాజీ అధ్యక్షుడు కుందన్ గుప్తా, బంకా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాంచన కుమారి, నలంద జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు రవి గోల్డెన్ ఉన్నారు. ఈ ఏడుగురు నేతలు తరచూ మీడియాలో పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినట్లు క్రమశిక్షణ కమిటీ తేల్చింది. వీరి నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు ఇచ్చామని,




అయినా ఆ నోటీసులకు వారు సంతృప్తికరమైన వివరణ ఇవ్వకపోవడంతో బహిష్కరణ వేటు వేశామని కాంగ్రెస్ తెలిపింది.

# బయటపడ్డ చైనా దొంగబుద్ధి..సరిహద్దుల్లో డ్రోన్ పరీక్షా కేంద్రం



న్యూఢిల్లీ,భారత్‌పై ట్రంప్ టారిఫ్‌లు పెంచిన తర్వాత మన దేశానికి చైనాతో సంబంధాలు బలపడుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ వెంట శాంతిభద్రతలు కాపాడుకునేందుకు భారత్–చైనా మధ్య చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య సరిహద్దుల్లో శాంతి కొనసాగుతోంది. అయినప్పటీకి చైనా మాత్రం తన దొంగబుద్ధిని మార్చుకోవడం లేదు. టిబెట్‌లోని భారత సరిహద్దు సమీపంలో తమ సైనిక మౌలిక సదుపాయాలను విస్తరిస్తోంది. %బాూజ% వెంబడి చైనా మిలిటరీ అయిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ సైనిక వసతుల నిర్మాణాలు, లాజిస్టిక్స్ హబ్‌లను నిర్మిస్తోంది.

మానవ రహిత విమానాల, డ్రోన్ల పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు

తాజాగా చైనా టిబెట్‌లో మానవ రహిత విమానాల, డ్రోన్ల పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అమెరికా వైమానిక దళంలో భాగమైన 'చైనా ఏరోస్పేస్ స్టడీస్ ఇన్‌స్టిట్యూట్' తమ రిపోర్ట్‌లో పేర్కొంది. దాదాపు 4300 మీటర్ల ఎత్తులో ఈ కేంద్రాన్ని నిర్మించిందని.. ఇందులో 720 మీటర్ల రన్‌వే, నాలుగు హ్యాంగర్లు, పరిపాలన భవంతులు ఉన్నట్లు అంచనా వేసింది. తాజాగా టిబెట్‌లో మానవ రహిత విమానాల, డ్రోన్ల పరీక్ష కేంద్రం, సైనిక వసతులు నిర్మాణ సౌకర్యాలను ఏర్పాటు చేయడం వల్ల డ్రాగన్ తమ సరిహద్దుల్లో బలగాన్ని పెంచుకుంటున్నట్లు సమాచారం.

చైనా ఎందుకు ప్రసిద్ధి చెందింది?

చైనా దాని పురాతన చరిత్రకు ప్రసిద్ధి చెందింది, ఇందులో గ్రేట్ వాల్ మరియు టెర్రకోట సైన్యం ఉన్నాయి, మరియు కాగితం, గన్‌పౌడర్ మరియు దిక్సూచి వంటి ఆవిష్కరణలతో ఆవిష్కరణలకు దాని సహకారాలు ఉన్నాయి.

## నెతన్యాహు భారత పర్యటన రద్దు

న్యూఢిల్లీ, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత్ పర్యటన మరోసారి రద్దయింది. ఇటీవల ఢిల్లీ ఎర్రకోట పేలుళ్లతో దేశంలో భద్రతా పరిస్థితులు సున్నితంగా మారిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఏడాది నెతన్యాహు పర్యటన రద్దవడం ఇది మూడో సందర్భం కావడం విశేషం. నెతన్యాహు ఈ సంవత్సరం చివరిలో భారత్‌ను సందర్శించాలని ప్రాథమికంగా నిర్ణయించినప్పటికీ, ఎర్రకోట బాంబు దాడి నేపథ్యంలో ఆయన షెడ్యూల్‌లో మార్పు చేశారు. అంతకుముందు సెప్టెంబర్ 19 న జరగాల్సిన ఒక రోజు పర్యటనను కూడా రద్దు చేసిన సంగతి విదితమే. అదేవిధంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ముందుగా నిర్ణయించిన పర్యటన కూడా వాయిదా పడింది. బెంజమిన్ నెతన్యాహు భారత్‌కు చివరిసారిగా 2018లో వచ్చారు. అయితే 2026లో నెతన్యాహు భారత్‌కు చేరుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యే అవకాశం ఉందని సమాచారం.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com